

విశాఖ-దుర్గ్ వందే భారత్ ప్రారంభం

దసరా...దీపావళి మధ్య రైల్వే జోన్‌కు భూమి పూజ

- కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు
- బెంగళూరు, చెన్నై నగరాలకు కూడా వందే భారత్ రైళ్లు వేయించడానికి కృషి చేస్తాం: ఎంపీ ఎం.శ్రీభరత్

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి దుర్గ్‌కు వేసిన కొత్త వందే భారత్ రైలు సర్వీసు సోమవారం ప్రారంభమైంది. దీనిని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అతి తక్కువ సమయంలో గమ్యస్థానాలకు తీసుకువెళ్లే విమానాలతో పోటీ పడేలా రైల్వే శాఖ గంటకు 200 కిలోమీటర్ల వేగంతో నడిచే వందే భారత్ రైళ్లను నడపడం గర్వకారణమన్నారు. విశాఖలో రైల్వే జోన్‌కు దసరా..దీపావళి మధ్య శుభ ముహూర్తం చూసి భూమి పూజ చేస్తామన్నారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, రైల్వే జోన్ రెండేళ్లలో ఆపరేషన్‌లోకి వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. బెంగళూరు, చెన్నై నగరాలకు కూడా వందే భారత్ రైళ్లు వేయించడానికి కృషి చేస్తామన్నారు. రూ.400 కోట్లతో విశాఖపట్నం ... మిగతా 6వ పేజీలో

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ



మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా సోమవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. సీరత్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు నగరంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు.



విశాఖ నుంచి దుర్గ్‌కు బయలుదేరిన వందేభారత్ రైలు...(ఇన్‌సెట్‌లో) ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఎంపీ ఎం.శ్రీభరత్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

ఏపీటీడీసీ లీజులపై విజిలెన్స్

భీమిలి బీచ్‌రోడ్డులో 'బే వాచ్', 'మేర్లిన్ కేఫ్' 'షోర్ ఫ్రంట్'లలో తనిఖీలు

- ఓ రెస్టారెంట్‌లో రెండు జీఎస్‌టీ నంబర్లతో వ్యాపారం చేస్తున్నట్టు గుర్తింపు
- అనంతరం కార్యాలయానికి వెళ్లి రికార్డులు పరిశీలన
- బే వాచ్‌కు వ్యతిరేకంగా నివేదిక ఇవ్వొద్దని నేతల ఫోన్లు



బేవాచ్ రిసార్ట్స్

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) విశాఖపట్నం జిల్లాలో లీజుకు ఇచ్చిన రెస్టారెంట్లు, ఇతర స్థిరాస్తులపై విజిలెన్స్ బృందం ఆది, సోమవారాల్లో విచారణ నిర్వహించింది. భీమిలి బీచ్‌రోడ్డులోని తొట్లకొండ వద్ద 'బే వాచ్' నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్‌కు జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేయడంతో ఆయన జిల్లా పర్యాటక శాఖాధికారిణితో విచారణ చేయించారు. దీనిపై ఇంకా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇదిలావుండగా మూర్తి యాదవ్ విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఏపీటీడీసీకి చెందిన ఇతర ఆస్తుల్లో కూడా అక్రమ లావాదేవీలు ఉన్నాయని ఆరోపించారు. అందులో వాస్తవాలు ఏమిటో తెలుసుకోవాలని పర్యాటక శాఖా మంత్రి విజిలెన్స్ విభాగాన్ని ఆదేశించారు. దాంతో విజయవాడ నుంచి ఒక బృందం విశాఖపట్నం వచ్చి తొట్లకొండ వెళ్లి బే వాచ్ రిసార్ట్‌ను పరిశీలించింది. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, గదులు అద్దెకు ఇవ్వడం, ఏపీటీడీసీకి చెందిన మద్యం దుకాణాన్ని కూడా వారే నిర్వహించడం వంటి విషయాలు గుర్తించారు. వారు అక్కడి నుంచి భీమిలి సమీపానున్న కంటెయినర్ రెస్టారెంట్ 'మేర్లిన్ కేఫ్'ను పరిశీలించారు. రూ.1.25 కోట్ల అద్దె బకాయిపై ఆరా తీశారు. ఆ తరువాత రుషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్, నిర్వహణ తీరును గమనించారు. ఆ బీచ్‌లోనే ఏపీటీడీసీ అద్దెకు ఇచ్చిన 'షోర్ ఫ్రంట్' రెస్టారెంట్‌ను తనిఖీ చేశారు. అక్కడ రెండు జీఎస్‌టీ నంబర్లతో వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించారు. అక్కడ చేసే వ్యాపారంపై ఏపీటీడీసీకి వాటా ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే తప్పుడు రికార్డుల కోసం రెండు జీఎస్‌టీలు నిర్వహిస్తున్నట్టు అనుమానిస్తున్నారు. ఆ తరువాత విజిలెన్స్ బృందం సిరిపురం వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్‌లో గల ఏపీటీడీసీ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించి, వివరాలు నమోదు చేసుకుంది.

వ్యతిరేక నివేదికలు ఇవ్వొద్దని ఫోన్లు

విజిలెన్స్ బృందంలో వచ్చిన ఒక అధికారి గతంలో పర్యాటక శాఖా మంత్రిగా ... మిగతా 6వ పేజీలో

ఉక్కుపై కేంద్రం ద్వంద్వ వైఖరి



- నిధులు ఇచ్చి కాపాడతామని ఒక వైపు ప్రకటన
- మరోవైపు 100 మందిని డిప్యుటేషన్‌పై ఎన్ఎండీసీకి పంపేందుకు రంగం సిద్ధం
- ఈ నెల 23 నుంచి 25 వరకు ఇంటర్వ్యూలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అనుసరిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కర్మాగారానికి నిధులు సమకూరుస్తామని, వాటితో ఉత్పత్తిని మెరుగుపరచుకుని నష్టాల నుంచి బయటపడాలని ఉద్యోగులకు చెబుతోంది. మరోవైపు విశాఖపట్నంలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్‌లలో 100 మందిని అత్యవసరంగా ఛత్తీస్‌గఢ్‌లోని ఎన్ఎండీసీకి చెందిన నగర్‌నార్ స్టీల్‌ప్లాంటుకు డిప్యుటేషన్‌పై పంపాలని ఆదేశించింది. ఇందుకోసం ఈ నె 23 నుంచి 25వ తేదీ వరకు ఎన్ఎండీసీ అధికారులు విశాఖపట్నం కర్మాగారంలోనే ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపింది. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన వారితో దరఖాస్తు చేయించాలని సూచించింది. విశాఖపట్నం కర్మాగారంలో పనిచేస్తున్న సీనియర్లు అందరినీ ఇతర ప్లాంట్లకు పంపిచేసి... ఇక్కడ మిగిలిన వారితో ఏమి చేయాలని ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు. ఇక్కడి కర్మాగారం పరిస్థితి రోజురోజుకూ ... మిగతా 6వ పేజీలో

ఇళ్ల నిర్మాణం పునః ప్రారంభం

- పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం
- రాక్‌ట్రీ మినహా మిగిలిన కంపెనీలకు అనుమతి
- త్వరలో సిమెంట్, ఇనుము సరఫరాకు చర్యలు
- వంశధార, గోదావరి నుంచి ఇసుక...
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 1.14 లక్షల ఇళ్ల కేటాయింపు
- కేవలం 3,782 పూర్తిచేసిన వైసీపీ ప్రభుత్వం



ప్రారంభమైన ఇళ్ల నిర్మాణ పనులు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):

నగరంలో పేదల కోసం శివారు ప్రాంతాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్క రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా సంస్థ మినహా మిగిలిన కాంట్రాక్టర్లు, కంపెనీలు పనులు చేపట్టేందుకు అనుమతించింది. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇనుము సరఫరాకు నిర్ణయించింది. గోదావరి, వంశధార నదుల నుంచి ఇసుకను సేకరించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించింది.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శివారు ప్రాంతాల్లో వేసిన 73 లేఅవుట్‌లలో 1.4 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. తొలుత 93 వేలు, తరువాత మరో 20 వేలు...మొత్తం 1.14 లక్షల ఇళ్ల నిర్మాణ పనులను అప్పటి అధికారులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. ప్రతి ఇంటికీ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కేంద్రం అందించే రూ.1.5 లక్షలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.30 వేలు సమకూర్చాలని నిర్ణయించారు. దీంతో పాటు లబ్ధిదారుల వాటా కింద డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి రూ.35 వేలు చొప్పున వసూలు చేశారు. సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో ఇళ్ల నిర్మాణాలకు 2022 ఏప్రిల్ 28న అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. అయితే పనులు మాత్రం చేయలేకపోయారు. ఈ ఏడాది మార్చి నాటికి 1,14,378 ఇళ్లకుగాను 6,228 ఇళ్ల పనులు ప్రారంభించనే లేదు. ప్రారంభించిన వాటిలో మార్చి వరకు 3,782 ఇళ్లు మాత్రమే ... మిగతా 6వ పేజీలో

వివాహిత కిడ్నాప్‌నకు యత్నం

- ఆటోలో బలవంతంగా తీసుకువెళుతుండగా కేకలు వేసిన బాధితురాలు
- వాహనాన్ని అటకాయించిన స్థానికులు
- ఆమెను వదిలి పరారైన నిందితులు
- రౌడీషీటర్ సహా మరొకరి అరెస్టు

పెందుర్తి, సెప్టెంబరు 16: వివాహితను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన రౌడీ షీటర్‌తో పాటు అతడికి సహకరించిన మరొకరిని సోమవారం పెందుర్తి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరానికి చెందిన వివాహిత ఇటీవల వేపగుంట ప్రాంతంలో నివాసం ఉంటున్న తన బాబాయి ఇంటికి వచ్చింది. పెందుర్తి జేఎన్ఎన్ఎంయూఆర్ కాలనీకి చెందిన నాగుల మోహన్ (27), అతడి స్నేహితులు మరో ఇద్దరు సోమవారం వివాహిత బాబాయి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఒంటరిగా ఉన్న ఆమెను బెదిరించి బలవంతంగా అక్కడ నుంచి తీసుకువెళ్లేందుకు యత్నించగా... ఆమె ప్రతిఘటించసాగింది. ఈలోగా బయటకు వెళ్లిన ఆమె బాబాయి వచ్చి అడ్డుకోగా నాగుల మోహన్, అతడి స్నేహితులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. అనంతరం వివాహితను బలవంతంగా ఇంటి నుంచి బయటకు తీసుకుని వచ్చి ముందుగా సిద్ధం చేసుకున్న ఆటోలో చినముషిడివాడలో గల స్నేహితుడి ఇంటికి తీసుకువెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆటో శారదా పీఠం సమీపంలోకి వచ్చేసరికి వివాహిత బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు కొందరు గమనించి వాహనాన్ని ఆపే ప్రయత్నం చేశారు. దీంతో దొరికిపోతామని భావించిన మోహన్, అతడి స్నేహితులు ఆటోలో నుంచి వివాహితను కిందకుతోసేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆమె జరిగిన విషయాన్ని తన భర్తకు సమాచారం అందించగా... ఆయన 100కు డయల్ చేశారు. సీఐ సతీష్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐ స్వామినాయుడు అక్కడకు చేరుకున్నారు. ఆమె ద్వారా సమాచారం సేకరించి కిడ్నాప్‌నకు యత్నించిన నిందితులకోసం గాలింపు చేపట్టారు. చినముషిడివాడలో నాగుల మోహన్‌ను, అతనికి సహకరించిన చినముషిడివాడ పాత ఊరుకు చెందిన నందవరపు కుమార్(28) పట్టుబడ్డారు. మోహన్‌పై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్ ఉందని, అది ఇటీవల పెందుర్తి పీఎస్‌కు బదిలీ అయ్యిందని సీఐ తెలిపారు. మరో నిందితుడు కుమార్ లారీ డ్రైవర్ అని అన్నారు. కిడ్నాప్ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని ఆచూకీ కోసం వెదుకుతున్నామన్నారు. వివాహిత గతంలో పెందుర్తిలో ఉండేదని, ఆ సమయంలో ఆమెను ప్రేమ పేరిట మోహన్ వేధించేవాడన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ అన్నారు.

బియ్యం సరఫరాలో చేతివాటం

బస్తాకు కిలో నుంచి మూడు కిలోల కోత

- సివిల్ సప్లైస్ గోదాముల్లో చిలక్కొట్టుడు
- సగటున ఒక్కో డీలరుకు 75 కిలోల నుంచి రెండు క్వింటాళ్ల వరకు తరుగు
- గోనె సంచి బరువుకు బదులుగా కూడా బియ్యం ఇవ్వని వైనం
- పట్టించుకోని అధికారులు

విశాఖపట్నం/మర్రిపాలెం/ఆరిలోవ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):

పౌర సరఫరాల సంస్థ గోదాముల నుంచి డీలర్లకు బియ్యం సరఫరాలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. 50 కిలోల బస్తాకు కిలో నుంచి మూడు కిలోల వరకూ తక్కువ ఇస్తున్నారు. దీనికి తోడు సంచి బరువుకు సరిపడా బియ్యం అందజేయడం లేదు. ఈ వ్యవహారంలో భారీ మతలబు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. జాయింట్ కలెక్టర్ స్థాయిలో అధికారులు హెచ్చరించినా గోదాము ఇన్‌చార్జిల తీరు మారడం లేదని డీలర్లు వాపోతున్నారు. నగరంలో సగానికిపైగా బినామీ డీలర్లు ఉండడంతో గోదాము ఇన్‌చార్జులను, అక్కడ సిబ్బందిని నిలదీసే పరిస్థితి ఉండడం లేదంటున్నారు. ప్రతి నెలా భారీగా బియ్యం మిగుల్చుకుని బయట అమ్ముకుంటున్నారని డీలర్లు ఆరోపిస్తున్నారు.



50 కిలోలు ఉండాల్సిన బస్తాలో 46 కిలోల 700 గ్రాములు మాత్రమే ఉన్నట్టు చూపుతున్న తూకం

జిల్లాలో గల 642 రేషన్ డిపోలకు గోదాముల నుంచి బియ్యం, ఇతర సరకులు సరఫరా చేస్తుంటారు. కార్డుల సంఖ్యను బట్టి ఒక డీలర్ ఇండెంట్ 6 టన్నుల బియ్యం అయితే 50 కిలోల వంతున 120 బస్తాలు ఇవ్వాల్సి ఉంటుంది. గోదాము నుంచి డిపోలకు వచ్చిన బియ్యం ప్రతి నెలా ఒకటో తేదీన తన పరిధిలో ఎండీయూలకు ఇచ్చేటప్పుడు తప్పకుండా కాటాలో తూకం వేయాలి. అయితే ప్రతి బస్తా కిలో నుంచి మూడు కిలోల వరకు బరువు తక్కువగా ఉంటుంది. అంటే 47 నుంచి 49 కిలోలు, అప్పుడప్పుడు ఐదారు కిలోలు తక్కువగా ఉండే బస్తాలు ఉంటున్నాయి. ఈ లెక్కన ఐదు టన్నుల ... మిగతా 6వ పేజీలో

19న గవర్నర్ రాక

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):



గవర్నర్ అబ్దుల్ నజీర్

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈనెల 19వ తేదీన నగరానికి రానున్నారు. 19న హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా నోవాటెల్ హోటల్‌కు వెళతారు. అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం సాయంత్రం ఐదు గంటలకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని మెరైన్ మైదానానికి చేరుకుని దివ్యకళా మేళాను ప్రారంభిస్తారు. తిరిగి 6.50 గంటలకు నోవాటెల్‌కు వెళ్లి రాత్రికి అక్కడే బస చేస్తారు. 20వ తేదీ సాయంత్రం 5.55 గంటలకు హోటల్ నుంచి బయలుదేరి 6.25 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని విజయవాడ వెళతారు.

రహదారి విక్రయం!?

- గుర్రంపాలెం పారిశ్రామికవాడ వద్ద రోడ్డు తవ్వి నిర్మాణాలు
- తమకు ఏపీఐఐసీ కేటాయించిందంటున్న కంపెనీ
- ప్రభుత్వానికి రామవరం, పరిసర గ్రామాల ప్రజల ఫిర్యాదు



గుర్రంపాలెం పారిశ్రామికవాడ వద్ద రహదారిపై జరుగుతున్న నిర్మాణ పనులు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామికవాడలోని ప్లాట్ల విక్రయంలో ఏపీఐఐసీ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న రహదారిలో కొంత భాగాన్ని కలిపి ఒక పారిశ్రామికవేత్తకు విక్రయించేశారు. సదరు పారిశ్రామికవేత్త ఆ ప్లాటులో నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో రహదారిని తవ్వడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

ఆనందపురం మండలం గండిగుండం జంక్షన్ నుంచి రామవరం గ్రామానికి వెళ్లే మార్గంలో గుర్రంపాలెం పారిశ్రామికవాడ ఉంది. రామవరం, పరిసర గ్రామాల ప్రజలు ఈ రహదారి పైనుంచి జాతీయ రహదారి మీదుగా పెందుర్తి వెళతారు. ఈ రోడ్డు నిర్మాణానికి 2012-13లో అప్పటి అనకాపల్లి ఎంపీ సబ్బం హరి పార్లమెంటు అభివృద్ధి నిధుల నుంచి రూ.5.6 లక్షలు కేటాయించారు. ఆ సమయానికి గుర్రంపాలెం పారిశ్రామికవాడ అంతగా అభివృద్ధి చెందలేదు. అయితే ఆ తరువాత ఏపీఐఐసీ అధికారులు అవగాహన లేక పారిశ్రామికవాడలో ప్లాట్ల అమ్మకాల సమయంలో రహదారిలో కొంతమేర విక్రయించేశారు. అలా ప్లాటు కొనుగోలు చేసిన ఓ పారిశ్రామికవేత్త రహదారిలో సుమారు 20 అడుగుల వెడల్పుతో 100 మీటర్లు పొడవునా తవ్వేసి నిర్మాణాలు చేపట్టారు. దీనిపై రామవరం, పరిసర గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తంచేస్తే తమకు ఏపీఐఐసీ కేటాయించిన భూమిలోనే నిర్మాణాలు చేపట్టినట్టు బదులిచ్చారు. పనులు నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఏపీఐఐసీ అధికారుల తీరుపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ప్రజల సొమ్ముతో వేసిన రహదారిని ఎలా తవ్వేస్తారని ప్రశ్నిస్తున్న స్థానికులు... ప్లాట్ల కేటాయింపుతో పాటు అక్కడకు సమీపంలో గల కొండ నుంచి గ్రావెల్ తవ్వకాల వ్యవహారంలో ఏపీఐఐసీ అధికారుల పాత్రపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

అంబికాబాగ్ ఆలయంలో యాగశాల ప్రారంభం



యాగశాల ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మహారాణిపేట, సెప్టెంబరు 16: మహారాణిపేటలోని అంబికాబాగ్ శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో యాగశాలను సోమవారం దక్షిణ నియోజవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలను చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, దాత అరుణ, ఈఈ సీహెచ్ వెంకటరమణ, ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు ప్రారంభం



ఇందిరా మున్సిపల్ స్టేడియంలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న అజయ్‌శర్మ

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 16: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను వామపక్ష నేత అజయ్‌శర్మ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి క్రీడా పోటీలతో ఉపాధ్యాయుల మధ్య చక్కటి వాతావరణం పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదపతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ప్రభాకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్. అంబేడ్కర్, జిల్లాలోని 11 మం డలాలకు చెందిన ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రపంచ బార్బర్స్ దినోత్సవం

కంచరపాలెం, సెప్టెంబరు 16 : ప్రపంచ బార్బర్ దినోత్సవం సందర్భంగా సోమవారం కంచరపాలెం ఏరియా బార్బర్ సంఘం ఆర్కే సోషల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్బర్ల సంఘం ప్రతినిధి మల్లువలస రాధాకృష్ణ, హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, పి. వెంకటేశ్వరరావు, జి.వి. రమణతోపాటు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు



జగదాంబ కూడలి, సెప్టెంబరు 16: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో చివరి రోజైన సోమవారం పవిత్రోత్సవ పూజలను భక్తిశ్రద్ధలతోనిర్వహించారు. ఉదయం 8 గంటల సమయంలో గణపతి పూజ, పుణ్యాహవాచన, పవిత్ర విరమణ, మహాపూర్ణాహుతి వేద ఆశీర్వచనతో పవిత్రోత్సవాలను వేద పండితులు పూర్తి చేశారు. ముం దుగా అమ్మవారి నిత్య పూజలను సంప్ర దాయ ప్రకారం అర్చ కులు జరిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనాలకు అవకాశం కల్పించారు. ఈ పూజల్లో ఈవో శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల మాత్రల పంపిణీ

కంచరపాలెం, సెప్టెంబరు 16: ప్రపంచ డీ వార్మింగ్ డే సందర్భంగా మంగళవారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేయనున్నట్టు గోపాలపట్టణం మండల విద్యాశాఖాధికారులు ఎ. సోమేశ్వరరావు, డి.దివాకర్ పేర్కొన్నారు.సోమవారం మధ్యాహ్నం భోజన అనంతరం ఉపాధ్యాయులు పిల్లందరితో మాత్రలు వేయించాలని సూచించారు. ఇప్పటికే మాత్రలు పాఠశాలలకు సరఫరా చేసినట్టు వివరించారు.



ఆర్అండ్‌బీ కార్యాలయం ముందే పార్కింగ్ చేసిన ట్రాలర్



జీఎస్ఐ కార్యాలయం ఎదుట ఇలా...

రహదారులే పార్కింగ్ ప్రదేశాలు

- మాధవధార పరిసరాల్లో సమస్య
- ఆర్టీఏ కార్యాలయం ఎదుట భారీ వాహనాలు నిలిపివేత
- వాహనదారుల రాకపోకలకు అవస్థలు

మురళీనగర్, సెప్టెంబర్ 16; ఉత్తర నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లోని మెయిన్ రోడ్లపై పార్కింగ్ స్థలాలు తరచూ మార్చుతుండడంతో వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు దీనికితోడు వాహనాలను రోడ్లపై నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. కీలకమైన ప్రభుత్వ కార్యాలయాలున్న మాధవధార ఆర్టీఏ కార్యాలయ పరిసరాల్లో ఈ సమస్య అధికంగా ఉంటోం ది. 51వ వార్డులోని మాధవధార ఉడాకాలనీ ప్రవేశమార్గంలోని హైవే సర్వీసు రోడ్డు వెంబడి ట్రాలర్లు, భారీ సరకు లారీలు నిలిపి గంటల తరబడి ఉంచేస్తున్నా రు. ఆర్అండ్‌బీ జంక్షన్‌లోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయం ఎదుట ఇదే పరిస్థితి. దీం తో ఉడాకాలనీ ప్రాంతాల నుంచిజాతీయ రహదారికి చేరేందుకు వాహనదారులకు చిక్కులు తప్పడం లేదు.

కీలకమైన ఈ మార్గంలోనే ఆర్టీఏ ఆఫీసు, ఎయిర్ పోర్టు జోన్ పోలీసు స్టేషన్, నార్త్ ఏసీపీ లా అండ్ ఆర్డర్ కార్యాలయం, జీఎస్ఐ సహా సచివాలయాలు, వాటర్ పంప్ హౌస్‌లు, ప్రైవేట్ డిగ్రీ కాలేజీలున్నాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే మార్గంలో రాకపోకలకు అడ్డంగా నిలిపివేస్తున్న వాహనాలతో ఎప్పటికపుడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఇదే సర్వీసు రోడ్డులో ఊర్వశిజంక్షన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ, బిర్లా జంక్షన్ డీ మార్ట్ వద్ద ఇదే విధమైన ఇదే సమస్యలు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.

నక్కవానిపాలెంలో నో పార్కింగ్ బోర్డులు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జరిమానా బోర్డు, కుండీలు తొలగించిన ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార, సెప్టెంబరు 16: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెంలో ఏఎంజీ ఆసుపత్రి పక్కరోడ్డులో ఏర్పాటు జరిమానా నోటీస్ బోర్డులను సోమవారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. 'ఆంధ్రజ్యోతి'లో 'ఎవరి కోసం ఈ ఆంక్షలు' శీర్షికన కథనం రావడంతో పోలీసు అధికారులు స్పందించారు. ఈ మార్గంలో ఏర్పాటు చేసిన జరిమానా బోర్డులు, కుండీలను తొలగించారు. 30 మీటర్లు దూరం కూడా లేని ఈ రోడ్డులో నాలుగు జరిమానా బోర్డులు పెట్టడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఆయా ప్రదేశాల్లో తమ వాహనాలను పార్కింగ్ చేస్తే- గతంలో ట్రాఫిక్ పోలీసులు ఫోటోలు తీసి జరిమానా విధించేవారని, ఇప్పుడు వాటిని తొలగించి సమస్య పరిష్కారం కావడంతో పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మర్రిపాలెం, సెప్టెంబరు 16: గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెం జాకీర్ హుస్సేన్‌నగర్‌లోని మజీద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో ఈద్ మిలాద్ ఉన్ నబీ (ప్రవక్త మహమ్మద్ జన్మదినం) వేడుకలు సో మవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు తెల్లవారుజామున ఫజర్ నమాజ్‌ను ఆచరించిన ఖురాన్ పఠించారు. చిన్నారులు నాతే కలంలు ఆలపించారు. అనంతరం జాకీర్ హుస్సేన్‌నగర్ నుంచి శాంతి ర్యాలీ నిర్వహించారు. కోటవీధి ఇషాక్ మదీనావలీ దర్గా వద్దకు చేరుకుని చదర్ (పవిత్ర వస్త్రం) సమర్పించి దావత్ నిర్వ హించారు. మజీద్ కమిటీ అధ్యక్షులు మూన్నా తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా వినాయకుని పల్లకి ఉత్సవం



పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ గోవింద్, తదితరులు

సీతంపేట, సెప్టెంబరు 16: సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయంలో ఆలయ ఈఓ రమాబాయి, ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి పల్లకీ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని సిద్ధి, బుద్ధి సమేతంగా వినాయక ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై సీతంపేట పుర వీధుల్లో మేళతాళాలతో పలు సంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, ఆయన కుమార్తె, బీజేపీ నేత శ్యామల దీపిక, కార్పొరేటర్ గోవింద్‌ల విచ్చేసి పల్లకిని మోశారు. అర్చకులు నటరాజన్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు.

అన్నసమారాధన

జ్ఞానాపురం: జ్ఞానాపురంలో బాబుకాలనీలో ఫ్రెండ్లీ బాయ్స్ ఆధ్వర్యంలో జరగుతున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ హజరై ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ అన్నదాన కార్య క్రమానికి రూ. 80వేలు విరాళం అందించారు. 32 వార్డు అమ్మవారి వీధి, 34వ వార్డు, క్లాప్ డ్రైవర్లు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో జనసేన నాయకులు, 32వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పాల్గొన్నారు.

దొండపర్తిలో దీపారాధన

దొండపర్తి: గ్రేటర్ 27వ వార్డు దొండపర్తి అల్లూరి వీధిలో రియల్ ఫ్రెండ్స్ వరసిద్ధి వినాయక మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సహస్ర దీపారాధన ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు చవితి పందిరి ఎదుట దీపాలను వెలిగించారు. అలాగే, మహిళలు ఎవరిళ్ల వద్ద వారు రంగుల ముగ్గులు వేసి దీపాలంకరణ చేయడంతో ఎంతో శోభాయానంగా కనిపించింది. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్‌గొలగాని వీరారావు బుజ్జి, కళా ఆస్పత్రి అధినేత పీవీ రమణమూర్తి, అల్లూరి అభినయ్‌రెడ్డి, పులి లోకేష్ రెడ్డి, అల్లూరి హర్షవీర్ రెడ్డి, సాయి దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరివీధిలో దీపారాధన



సాంస్కృతిక ప్రదర్శనలు

26న రాజస్థాన్‌లో బ్రహ్మకుమారీస్ సదస్సు



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ

సీతమ్మధార, సెప్టెంబరు 16: బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ నుంచి రాజస్థాన్ మౌంట్‌అబులో నిర్వహించనున్న జాతీయ మీడియా సదస్సునువిజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ మేయర్, టీడీపీ సీనియర్ నాయకుడు దాడి సత్యనారాయణ అన్నారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని సింధూర అతిథి గృహంలో బ్రహ్మ కుమారీస్ విశాఖ మీడియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మౌంట్‌అబులో జరిగే జాతీయ సదస్సులో పలు ఆధ్యాత్మిక అంశాలపై విశ్లేషణ ఉంటుందని, జర్నలిస్టుల ఈ యాత్ర విజయవంతం చేయాలన్నారు. బ్రహ్మ కుమారీస్ సంస్థ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ రాజస్థాన్‌లో గల మౌంట్ అబులో ప్రజాపీత బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయంలో జాతీయ మీడియా సదస్సు ఈ నెల 26 నుంచి 30 వరకు సాగుతుందన్నారు. ఆధ్మాత్మికత, క్రమశిక్షణకు ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జాతీయ వినియోగదారుల మండలి చైర్మన్ సాయి రమేష్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు శివజ్యోతి, సిద్దు, మరళీకృష్ణ, సునీత, నారాయణ, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



మార్చురీలో మృతదేహం

సీతంపేట, సెప్టెంబరు 15: గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈనెల ఒకటో తేదీన పోర్టు ఆసుపత్రి సమీపంలో ఈ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉ న్నారు. నాలుగో పట్టణ పోలీసు సిబ్బంది గుర్తించి 108 వాహనంలో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మృతి చెందారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఎవరైనా సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

28న భగత్‌సింగ్‌పై వ్యాస, వక్తృత్వ పోటీలు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 16: స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ 117 జయంతి సందర్భంగా దిశ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నవజవాన్ భారత్ సభ (ఎన్‌బీఎస్) నగరంలోని వివిధ స్కూల్స్‌కు, కాలేజీలు, హాస్టళ్లలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. భగత్‌సింగ్ ఆలోచనలు, నేటి సమాజంలో వాటి ఆవశ్యకతను ప్రధానంగా తెలియజేయాలన్నదే పోటీల ఉద్దేశం. ఇతర వివరాలకు ఫోన్ 90522 44546, 70857 55584ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

- యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్చరిక



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 15: విశాఖ పోర్టు ట్రస్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేట్ పరం చేయాలన్న యోచన తగదని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. జగదాంబ వద్ద సీఐటీయూ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. విశాఖ పోర్టు ట్రస్ట్ యాజమాన్యంలో నడుస్తున్న గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. 90 ఏళ్ల చరిత్రగల ఈ ఆస్పత్రి పరిరక్షణకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆస్పత్రిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోర్టు ట్రస్ట్ చైర్మన్, ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు సెక్రటరీకి వేల మంది పోర్టు ఉద్యోగులతో సంతకాల సేకరణ చేసి పంపుతామన్నారు. ఈ హాస్పిటల్ ప్రైవేట్ పరం చేసే చర్యలకు వ్యతిరేకంగా ఈనెల 19నుంచి విధుల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన కొనసాగిస్తామన్నారు. పోర్టు ఏవోబీ వద్ద 24న పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. పోర్టు హాస్పిటల్ ఎదుట అక్టోబరు 1 తేదీన నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ దీక్షల్లో కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు వి.రామలింగేశ్వరరావు, జక్కన్న సత్యనారాయణ, బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఫిల్మ్ ఇండస్ట్రీని తీసుకువచ్చేందుకు కృషి

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



రామ్మోహన్‌నాయుడిని సత్కరిస్తున్న అచ్యుతరావు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 16: సినిమా పరిశ్రమను తెలంగాణ నుంచి ఏపీకి రప్పించేందుకు కృషి చేయనున్నట్టు కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. సోమవారం నగరంలోని కేంద్ర మంత్రిని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ డా.కంచర్ల అచ్యుతరావు కలిసి వినతి పత్రం అందజేశారు. ఫిల్మ్ ఇండస్ట్రీ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ఇండస్ట్రీ విశాఖకు తరలివస్తే వందల కుటుంబాలకుఉపాధి కలుగుతుందని తెలిపారు.

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

ఆరిలోవ, సెప్టెంబరు 16 : ఎండాడ పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం ఉదయం పొట్నూరి అప్పలరాజు (35) అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. అతను మృతికి అదే ప్రాంతానికి చెందిన మనోజ్, షణ్ముఖరావు కారణమని ఆరిలోవ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకా రం...ఎండాడ వివేకానందనగర్ పార్కు సమీపంలో సాయితేజ అపార్ట్‌మెంట్‌లో అప్పలరాజు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం బైక్ మీద ఎండాడ పెట్రోల్ బంక్‌కు వచ్చాడు. పెట్రోల్ కొట్టించుకుని బంక్ నుంచి వస్తుండగా అక్కడికి సమీపంలో ఉన్న స్క్రాప్ దుకాణం వద్ద మనోజ్, షణ్ముఖరావు బైక్ ఆపారు. అప్పటికే మద్యం మైకంలో ఉన్న వారు అప్పలరాజును అగ్గిపెట్టె అడిగారు. అతను లేదని చెప్పి బైక్ తీయగా వారిద్దరూ అప్పలరాజును గట్టిగా వెనక్కి లాగారు. దీంతో అతను స్క్రాప్ దుకాణం వద్ద ఉన్న మెట్లపై పడిపోవడంతో తలకు బలమైన గా యమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

విశాఖ-దుర్గ్ వందే భారత్ ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

రైల్వే స్టేషన్ అభివృద్ధి జరుగుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ, వందే భారత్ రైళ్లలో టికెట్ చార్జీలు అధికంగా ఉన్నాయని, వాటిని తగ్గించి, సామాన్యులు కూడా ప్రయాణించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ హరికుమారి, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రసంగించగా, ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, పాల్గొన్నారు.

ఏపీటీడీసీ లీజులపై విజిలెన్స్

... 5వ పేజీ తరువాయి

పనిచేసిన వైసీపీ నాయకురాలి వద్ద ఓఎస్డీగా పనిచేశారని సమాచారం. ఆ వివరాలు తెలుసుకున్న 'బే వాచ్' లీజుదారులైన స్థానిక వైసీపీ నాయకులు ఆ నాయకురాలికి ఫోన్ చేసి సాయం చేయాల్సిందిగా కోరడంతో, ఆమె విజిలెన్స్ అధికారికి ఫోన్ చేసి వ్యతిరేక నివేదిక ఇవ్వవద్దని చెప్పినట్టు తెలిసింది. అక్కడితో ఆగకుండా తొట్లకొండ ఏ పరిధిలో ఉందో ఆ నియోజకవర్గ కూటమి నాయకుడితో కూడా విజిలెన్స్ బృందానికి ఫోన్ చేయించి, ఫిర్యాదులను లైట్‌గా తీసుకోవాలని చెప్పించినట్టు తెలిసింది. విచారణ ముగించుకొని విజయవాడ వెళ్లిపోయిన ఆ బృందం ఏమని నివేదిస్తుందో, ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి. అయినా వైసీపీ నాయకులకు చెందిన లీజు ఒప్పందాలను రక్షించడానికి కూటమి నాయకులు యత్నించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఉక్కుపై కేంద్రం ద్వంద్వ వైఖరి

... 5వ పేజీ తరువాయి

దిగజారిపోవడం గమనించిన సీనియర్ మేనేజర్ స్థాయి అధికారులు 200 మంది ఇప్పటికే రాజీనామా చేసి వెళ్లిపోయారు. ప్రతి నెలా సగటున 20 మంది పదవీ విరమణ చేస్తున్నారు. మరోవైపు నియామకాల ప్రక్రియ చాలాకాలం క్రితమే ఆపేశారు. దీంతో ఇప్పటికే కీలక విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. ప్లాంటును పూర్తి స్థాయిలో నడపాలంటే ప్రస్తుతం 300 మంది ఇంజనీర్లు అవసరమని, కనీసం కాంట్రాక్టు ప్రాతిపదికనైనా నియమించుకోవడానికి అనుమతి ఇవ్వాలని గత ఏడాది నాటి సీఎండీ అతుల్ భట్ ఉక్కు మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. ఇక్కడ పరిస్థితి ఇలా ఉండగా, ఉన్నవారిని దశల వారీగా ఇతరచోట్లకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఇంకో వైపు స్వచ్ఛంద పదవీ విరమణకు కూడా నిధులు ఇస్తామని చెబుతున్నారు.

ఇదంతా కుట్ర

-అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ

కేంద్రం చేపడుతున్న చర్యలు చూస్తుంటే...విశాఖపట్నం ప్లాంటులో ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని కృతనిశ్చయంతో ఉన్నట్టు కనిపిస్తోంది. ఏదో కంటితుడుపుగా కొంత ఆర్థిక సాయం చేసి, నష్టాల నుంచి బయటకు రాలేకపోయారు కాబట్టి...ఇక ఏమీ చేయలేమని చెప్పి చేతులు దులుపుకోవాలని కుట్ర చేస్తున్నారు. అలాకాకుండా ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడానికి అవసరమైన ముడి పదార్థాలు సమకూరిస్తే 100 శాతం ఉత్పత్తితో ఈ గండం నుంచి గట్టెక్కిస్తాం.

ఇళ్ల నిర్మాణం పునఃప్రారంభం

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేయగా, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయి.

ఆదినుంచీ రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా మొండి వైఖరి

అనంతపురం జిల్లాలోని వైసీపీ మాజీ ప్రజా ప్రతినిధికి చెందిన రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా సంస్థకు తొలుత 35 వేల ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఆది నుంచీ ఈ సంస్థ ఇష్టానుసారంగా వ్యవహరించడం, అధికారుల ఆదేశాలను పాటించకపోవడం, పనులు చేపట్టకపోవడంతో సంఖ్యను విడతల వారీగా తగ్గించి చివరకు 11,575 ఇళ్లకు పరిమితం చేశారు. కాగా ఈ ఏడాది మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత నిర్మాణ బాధ్యతలు చేపట్టిన అన్ని కంపెనీలు ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశాయి.

పూర్తిచేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు

రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇటీవల ఇళ్ల పురోగతిపై సమీక్షించింది. నిర్మాణ బాధ్యతలు తీసుకున్న రాక్‌ట్రీ ఇన్‌ఫ్రాపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అదే సమయంలో మిగిలిన కంపెనీలు, సంస్థలు పనులు తిరిగి ప్రారంభించుకునేలా ఆదేశాలు జారీచేసింది. రాక్‌ట్రీ మినహా మిగిలిన చిన్న కంపెనీలు ఇప్పటికే పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లుచేసుకున్నాయి. పెద్ద కంపెనీలు కూడా త్వరలో పనులు చేపట్టేందుకు ముందుకువచ్చాయి. అయితే రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా ఇప్పటివరకు నిర్మాణాలు చేపట్టి, మధ్యలో విడిచిపెట్టిన వాటిని ఎలా పూర్తిచేయాలనే దానిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఇదిలావుండగా పనులు చేపట్టేందుకు అవసరమైన ఇనుము, సిమెంట్ త్వరలో సరఫరా కానున్నాయని జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి ఒకరు తెలిపారు. కొన్ని లేఅవుట్‌లలో చిన్నచిన్న పనులు చేపట్టేందుకు ఇసుక అందుబాటులో ఉందన్నారు. పనులు పూర్తిస్థాయిలో మొదలయ్యేసరికి గోదావరి, వంశధార నుంచి ఇసుక తీసుకువస్తామన్నారు. మార్చి వరకు చేపట్టిన పనులకు ఇంతవరకు సంబంధిత కంపెనీలకు రూ.479 కోట్లు చెల్లించామని, పెండింగ్‌లో ఉన్న మరో రూ.25 కోట్లు త్వరలో విడుదలవుతాయన్నారు.

బియ్యం సరఫరాలో చేతివాటం

... 5వ పేజీ తరువాయి

ఇండెంట్ పెట్టిన డీలరుకు సగటున 60 నుంచి 75 కిలోలు, 10 టన్నులు అయితే 150 కిలోలు, అంతకు మించి ఎక్కువ ఇండెంట్ ఉన్న డీలర్లకు 300 నుంచి 400 కిలోల వరకూ తరుగు ఉంటుంది. అలాగే నిబంధనల ప్రకారం ప్రతి బస్తాకు సంబంధించి గోనె సంచి బరువు మినహాయించాలి. ఖాళీ గోనె బరువు 580 గ్రాములు. అంటే 50 కిలోల బస్తా ఇవ్వాలంటే 50.580 కిలోల బరువు ఉండే బియ్యం అందజేయాలి. అయితే ఖాళీ గోనె బరువు కలిపి తూకం వేసి ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత నెలకు సంబంధించి వన్‌టౌన్‌లో ఒక డీలరుకు సరఫరా చేసిన బియ్యంలో 175 కిలోలు తగ్గాయి. మర్రిపాలెం, అక్కయ్యపాలెం, సీతమ్మధార, మద్దిలపాలెం ప్రాంతాల్లో డీలర్లకు సగటున 100 కిలోల నుంచి 200 కిలోల వరకు తూకంలో తేడా వచ్చిందని డీలర్లు చెబుతున్నారు. మధురవాడ, ఆరిలోవ ప్రాంతాల్లో ఒక్కో డీలర్ పరిధిలో 1,200 కార్డులు దాటి ఉన్నందున అక్కడ మరింత ఎక్కువగా తూకంలో తేడాలు వస్తున్నాయని చెబుతున్నారు. మర్రిపాలెంలో-1 గోదాములో తూకంలో తేడాలు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ ఉద్యోగిని మాతృశాఖకు సరండర్ చేసి అక్కడ పౌర సరఫరాల సంస్థ నుంచి ఒకరికి బాధ్యతలు అప్పగించారు. అయితే ఎటువంటి మార్పులేదని డీలర్లు ఆరోపిస్తున్నారు. పొరపాటున ఎవరైనా నేరుగా కలెక్టర్/జాయింట్ కలెక్టర్‌లకు ఫిర్యాదు చేస్తే సదరు డీలర్‌కు వేధింపులు ఎదురవుతుంటాయి. దీంతో ఎవరూ ఫిర్యాదు చేయడానికి సాహసించలేకపోతున్నారు. దానిని ఆసరాగా తీసుకుని గోదాముల ఇన్‌చార్జులు, సిబ్బంది చెలరేగిపోతున్నారు. చివరకు సంఘాలు నేతలు కూడా తమ ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం లేదని డీలర్లు వాపోతున్నారు.

పేరుకే ప్రసూతి కేంద్రం.. ప్రసవాలకు మాత్రం దూరం

నాడు ఎంతో ఆర్భాటంగా ప్రారంభం

నేడు నిరుపయోగంగా మారిన వైనం

ఇదీ శ్రీహరిపురంలోని జీవీఎంసీ ఆస్పత్రిలోని కేంద్రం దుస్థితి

అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న పారిశ్రామిక ప్రాంత ప్రజలు



శ్రీహరిపురంలోని జీవీఎంసీ ఆస్పత్రి

మల్కాపురం, సెప్టెంబరు 16: శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి భవనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రసూతి కేంద్రం నిరుపయోగంగా మారింది. 2012లో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న మళ్ల విజయప్రసాద్, అసెంబ్లీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ ఇక్కడి ఆస్పత్రిలో ప్రసూతి కేంద్రాన్ని ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ అప్పటినుంచి ఇప్పటివరకు ఎలాంటి సేవలకు ఇది నోచుకోవడం లేదు. ఇందులో ఒక్క ప్రసవం కూడా జరగలేదనడం అతిశయోక్తి కాదు. మరి ఎందుకు ఇక్కడ దీనిని ఏర్పాటు చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పన్నెండేళ్లుగ ఈ ప్రసూతి కేంద్రం వినియోగంలోకి రాకపోవడంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన అనేక మంది ఇబ్బంది గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో ప్రసూతి ఆస్పత్రి ఎంతో అవసరం. నగరంలో ఘోషాస్పత్రి.. ఇటు అగనంపూడిలో ప్రభుత్వ ఆస్పత్రి ఇక్కడకు చాలా దూరంగా ఉన్నాయి. అత్యవసర సమయంలో గర్భిణులు అంత దూరం ప్రయాణించాలంటే ఎంతో కష్టతరం. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అప్పటి ప్రభుత్వం శ్రీహరిపురంలోని జీవీఎంసీ ఆస్పత్రిలో ప్రసూతి కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ, ఆ తర్వాత వైద్య సిబ్బందిని నియమించకపోవడంతో ఇది నిరుపయోగంగా మారింది. ఆస్పత్రికి అన్ని సౌకర్యాలు కల్పించినా మహిళలకు వైద్యం చేసేందుకు గైనిక్ డాక్టర్‌ను నియమించలేదు. దీంతో ఈ కేంద్రం వృథాగా మిగిలింది. ప్రైవేటు ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలకే రూ.వేలల్లో ఖర్చవుతుంది. ఇక సిజేరియన్లు చేయాల్సి వస్తే రూ.లక్షల్లో ప్రైవేటు ఆస్పత్రులు రోగుల నుంచి గుంజేస్తున్నాయనే విమర్శలున్నాయి. అంత మొత్తంలో ఖర్చును పేద, మధ్యతరగతి వర్గాలు వెచ్చించలేకున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇక్కడి ఆస్పత్రిలో ప్రసూతి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చొరవ చూపాలని ఈ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆ యాజమాన్యాలు చొరవ చూపాలి

హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కంపెనీలు సామాజిక సేవా కార్యక్రమాల పేరుతో కేజీహెచ్‌కు కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయి. అందువల్ల ఈ రెండు కంపెనీలు శ్రీహరిపురంలోని ప్రసూతి కేంద్రం నిర్వహణ బాధ్యతలు తీసుకుంటే మహిళలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





ఆస్పత్రిలో మూసివేసిన ప్రసవాలు వేసే గది, పక్కన నిరుపయోగంగా ఉన్న పరికరాలు



ముస్లింలతో కలిసి శాంతి ర్యాలీలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు

గాజువాకలో ముస్లింల శాంతి ర్యాలీ

గాజువాక, సెప్టెంబరు 16: మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మీలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు సోమవారం గాజువాకలో భారీ శాంతి ర్యాలీని నిర్వహించారు. స్థానిక అజీమాబాద్ సున్నిజామ మసీద్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కణితి రోడ్డు, పాత గాజువాక జంక్షన్, బీసీ రోడ్డు మీదగా బాబా సయ్యద్ మదీనా షా హౌలియా దర్గా వరకు సాగింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ర్యాలీలో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశం శాంతియుతంగా ఉండాలని ర్యాలీ చేపట్టిడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, ప్రసాదుల శ్రీనివాస్, అన్వర్ వల్లీ, రజవుల్లా, ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: 'పల్లా'

అగనంపూడి, సెప్టెంబరు 16: నియోజవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 79వ వార్డు పరిధి అగనంపూడి, శనివాడ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శనివాడలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శనివాడ గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తానన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో మాట్లాడి పాఠశాల, ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, కూటమి నాయకులు కర్రి దశేంద్ర, మేడిశెట్టి విజయ్, కరణం జగదీశ్, సుబ్బరాజు, ఎస్.సింహాచలం, వెంకటరావు, రేవతి, హనిత, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీతాల్లో కోతలు విధిస్తే ఊరుకోం

అఖిలపక్ష కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నాయకులు



సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న యూనియన్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 16: బయోమెట్రిక్ పేరుతో జీతాల్లో కోతలు విధిస్తే ఊరుకునేది లేదని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంటులోని ఎల్ఎంఎం పార్కులో సోమవారం జరిగిన సమావేశంలో వారు కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు మస్టర్ కార్డులు, అటెండన్స్ రిజిస్టర్ ఆధారంగా జీతాలు చెల్లించాలని, గేట్లు దగ్గర అమర్చిన మిషన్లు ఆధారంగా జీతాల్లో కోత విధించే నిర్ణయాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఈ నెల 18న చేపట్టనున్న ధర్నాను కార్మికులంతా విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రవి, పిట్టా రెడ్డి, భాస్కరరావు, అప్పారావు, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలంటూ చెత్త సేకరణ వాహన కార్మికుల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న కార్మిక నాయకులు, వాహనాల డ్రైవర్లు

గాజువాక, సెప్టెంబరు 16: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ చెత్త సేకరణ వాహన కార్మికులు సోమవారం స్థానికంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు, వాహన డ్రైవర్లు కాంట్రాక్టరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం వల్ల తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల కోసం కాంట్రాక్టరును ప్రశ్నిస్తున్నా పట్టించుకోపోవడం లేదని వాపోయారు. అందువల్ల అధికారులు కల్పించుకుని తమ సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు అనీల్, సుధీర్, లక్ష్మీ, రాజు, గొలగాని అప్పారావు, వీర్రాజ్, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఎన్ఏడీ ఫ్లైఓవర్ పిల్లర్ పనులు

ఎన్.ఎ.డి. జంక్షన్, సెప్టెంబరు 16: ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌కు అనుసంధానంగా రైల్వే ట్రాక్‌పై కొత్తగా చేపడుతున్న ఫ్లైఓవర్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఫ్లైఓవర్‌కు సంబంధించి చివరి పిల్లర్ సెంటరింగ్ పనులు చేస్తున్నారు. ఇక్కడి రెండు రైల్వే లైన్లపై గతంలో ఉన్న రెండు వంతెనల మధ్య కొత్తగా ఫ్లైఓవర్ నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో నత్తనడకన సాగిన ఈ పనులు కూటమి ప్రభుత్వం రావడంతో వేగవంతమయ్యాయి. రెండు రోజులుగా మధ్యాహ్న వేళల్లో ట్రాఫిక్‌ను నియంత్రించి పనులు సాగిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే పోతిన సన్యాసిరావుకు నివాళి

పెదగంట్యాడ, సెప్టెంబరు 16: విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన కమ్యూనిస్టు నేత, మాజీ ఎమ్మెల్యే పోతిన దివంగత సన్యాసిరావు ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ 'గాజువాక' కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. పెదగంట్యాడలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సన్యాసిరావు 40వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పల్లేటి పోలయ్య, ఆనంద్, అచ్యుతరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: మల్కాపురం గ్రామ మండలిలో మాజీ ఎమ్మెల్యే పోతిన సన్యాసిరావు వర్ధంతిని సీపీఐ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పశ్చిమ నియోజకవర్గ సీపీఐ కన్వీనర్ కాండ్రేగుల సత్యాంజనేయ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సన్యాసిరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు త్రినాథరావు, సత్తిబాబు, కామేశ్వరరావు, రామకృష్ణరావు, కనకేశ్వరరావు, పోతిన రాము, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

బీజేపీ సభ్యత్వ నమోదు

గాజువాక, సెప్టెంబరు 16: స్థానిక హై స్కూల్ రోడ్డులో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం పనిచేసే ఏకైక పార్టీ తమదేనన్నారు. దేశం అభివృద్ధి బాటలో ప్రయణించాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకరరావు, సత్యనారాయణ, రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



మల్కాపురంలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం, సెప్టెంబరు 16: గ్రేటర్ 60వ వార్డు మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు సీపీఎం జాతీయ నాయకుడు సీతారామ్ ఏచూరి సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మల్కాపురం జోన్ పార్టీ నాయకులు లక్ష్మణమూర్తి, పెంటరావు హాజరై సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కె.రమణ, బి.రాంబాబు, సూరిబాబు, రాము, రైల్‌బాబు, తిరుపతిరావు, ఆదినారాయణ రాజు, రమణమ్మ, లక్ష్మి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 52, టమాటా 38, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 40, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయ 34, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 22, క్యారెట్ 40, దొండకాయలు 34, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 42, ముల్లంగి 34, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..

పేదోడికి పట్టెడన్నం పెట్టడమే ప్రభుత్వ లక్ష్యం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



వంటిల్లు కూడలిలోని అన్న క్యాంటీన్‌లో అధికారులతో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు



ఆటోనగర్‌లోని అన్న క్యాంటీన్ వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, అధికారులు

గాజువాక, సెప్టెంబరు 16: పేదవాడికి పట్టెడన్నం పెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి వంటిల్లు సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రం వ్యాప్తంగా రెండు వందలకు పైగా అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. మరో రెండు రోజుల్లో ఇక్కడి క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అధికారులతో మాట్లాడి అన్న క్యాంటీన్ పనుల గురించి తెలుసుకున్నారు. పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం ప్రజలకు అందేలా చూడాలని ఆదేశించారు. పల్లా వెంట కార్పొరేటర్లు పల్లా శ్రీను, రౌతు శ్రీనివాస్, బొండా జగన్, రాజాన రామారావు, కేబుల్ మూర్తి, స్థానిక నాయకులు వెంకటరమణ, బలగా బాలునాయుడు, నమ్మి సింహాద్రి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఆటోనగర్‌లోని అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

ఆటోనగర్: ఆటోనగర్‌లోని అన్న క్యాంటీన్ పనులను సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, జీవీఎంసీ ఎస్ఈ గోవిందరావు పరిశీలించారు. ఈ సందర్భంగా బొండా జగన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుల ఆదేశాలు మేరకు సిద్ధమైన అన్న క్యాంటీన్లను పర్యవేక్షించామన్నారు. పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఈఈ ఎంఆర్ఎస్ అప్పారావు, ఏఈ సతీశ్‌కుమార్, సచివాలయ సిబ్బంది వరప్రసాద్, టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, పప్పు శంకరరావు, రాజన్ రాజు, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



గృహనిర్మాణ శాఖ అధికారులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, సెప్టెంబరు 16: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్ష మేరకు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదేశించారు. సుజాతనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం గృహ నిర్మాణశాఖ అధికారులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాల పూర్తికి వంద రోజుల కార్యచరణ ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో వివిధ దశలో ఉన్న 11,200 వేల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలన్నారు. పెందుర్తి అర్బన్‌లో మంజూరైన 6,339 గృహాల్లో కేవలం 500 శ్లాబ్ లెవెల్ వరకు మాత్రమే పూర్తి కావడంపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ జాప్యంపై కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామీణ మండలాలైన పెందుర్తి సబ్బవరం, పరవాడల్లో కేటాయించిన 4,861 ఇళ్లల్లో 2,600 పూర్తయినట్టు అధికారులు వివరించారు. శ్లాబ్, బేస్‌మెంట్ దశల్లో 2,261 గృహ నిర్మాణాలున్నాయని ఎమ్మెల్యేకు తెలిపారు. అక్టోబరు నెలాఖరుకల్లా అన్ని నిర్మాణాలు పూర్తి కావాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రోజువారీ పురోగతి నివేదిక సమర్పించాలని పంచకర్ల సూచించారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించేలా లబ్ధిదారులు, కాంట్రాక్టర్‌ను సమన్వయం చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ శాఖ పీడీ శ్రీనివాసరావు, డీఈ ఏవీఎస్ఎన్ రాజు, ఏఈలు దీపక్, ప్రవీణ్, ఇన్‌స్పెక్టర్ భానుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నడుపూరులోని శ్రీసంకట విమోచన గణపతి ఆలయంలో పూజల్లో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, తదితరులు



ఎర్రగెడ్డ కాలనీలో పూజలు అందుకున్న లక్ష్మీగణపతి స్వామి



గ్రీన్ సిటీలో ప్రతిష్ఠించిన బొజ్జ గణపతి మండపంలో సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా గణనాథునికి పూజలు

పెదగంట్యాడ, సెప్టెంబరు 16: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులోని శ్రీసంకట విమోచన గణపతి ఆలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ సంప్రదాయానికి ఓ ప్రత్యేకత ఉంటుందని, ప్రతి పూజా కార్యక్రమంలోను స్థానికులు సంఘటితంగా పాల్గొంటారన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా సమష్టిగా ఉండాలని కోరారు. ఆయన వెంట టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు, రాజాన రామారావు, కమిటీ సభ్యులు శంకర నారాయణ, గోపి, రమణ, తదితరులు ఉన్నారు.

కూర్మన్నపాలెం: గ్రేటర్ 88వ వార్డు పరిధి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్ సిటీ హోమ్స్‌లో ప్రతిష్ఠించిన వినాయక మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం జరిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. అనంతరం నిర్వహించిన వేలంలో లడ్డూను రూ.60,200కు దుర్గాప్రసాదరావు అనే వ్యక్తి సొంతం చేసుకున్నారు. సాయంత్రం పురవీధుల్లో స్వామి వారిని వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. వైజాగ్ ప్రొఫైల్స్ ప్రతినిధులు వీవీ కృష్ణారావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, రవికుమార్, సందీప్, తన్మయ్ మైత్రే, టి.లావణ్య, సునీల్, గణేశ్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు. అలాగే వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథున్ని, శ్రీగణేశ్‌నగర్, తెలుకలవీధి, వడ్లపూడిల్లో మండపాల్లో ఏర్పాటు చేసిన గణేశున్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ దర్శించుకున్నారు. 70వ వార్డు ఎర్రగెడ్డ కాలనీలోని లక్ష్మీగణపతిస్వామి ఆలయంలో స్వామి వారిని వెండి కవచధారణ చేసి ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేటి రమణ పర్యవేక్షణలో పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామావళితో పూజలు, లక్ష్మీగణపతి హోమం జరిపారు. ప్రతినిధులు కేవీఎస్ శంకరరావు, శివాజీ, నాయుడు, గోవింద, సూరిబాబు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సంపత్ వినాయక ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి అన్నాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గణనాథునికి చక్రస్నానం, విశేష వస్త్రాలంకరణ, మహా మంత్ర పుష్పార్చన, వింజామర సేవ కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, మడుగుల నరసింగరావు, వి.నారాయణరావు, ఎం.శ్రీనివాసరావు, జి.వెంకటరమణ, ఎ.సోమేశ్వరరావు, వి.ఈశ్వరరావు, వెంకటరమేశ్, జగ్గారావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



పెదమడకలో గణేశునికి అన్నాభిషేకం

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం సమీపంలోని భవానీనగర్‌లోని గణేశుని మండపం వద్ద అన్న సమారాధనను కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారభించారు. కాలనీ అభివృద్ధి సంఘం ప్రతినిధులు బొడ్డు నారాయణమూర్తి, చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే చింతలఅగ్రహారం గవరపాలెం బస్టాండ్ కూడలిలో కొత్తిమీర వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం గణనాథున్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: ఎన్.ఎ.డి. కొత్తరోడ్డు శాంతినగర్ పార్కు వద్ద విజయ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన అన్న సమారాధనను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు జియ్యాన విజయ్, పి.ఆదినారాయణ, పి.రవి, సింహాద్రి, నూకరాజు, చరణ్, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం పలుచోట్ల ప్రతిష్ఠించిన గణేశుల ప్రతిమలను ఉత్సవ కమిటీ నిర్వాహకులు మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.



కొత్త గాజువాక బీసీ రోడ్డులోని సీతారాంనగర్‌లో ప్రతిష్ఠించిన గణనాథుని నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు, నిర్వాహకులు

అంబికాబాగ్ ఆలయంలో యాగశాల ప్రారంభం



యాగశాల ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మహారాణిపేట, సెప్టెంబరు 16: మహారాణిపేటలోని అంబికాబాగ్ శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో యాగశాలను సోమవారం దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలను చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, దాత అరుణ, ఈఈ సీహెచ్ వెంకటరమణ, ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు ప్రారంభం



ఇందిరా మున్సిపల్ స్టేడియంలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న అజయ్‌శర్మ

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 16: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను వామపక్ష నేత అజయ్‌శర్మ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి క్రీడా పోటీలతో ఉపాధ్యాయుల మధ్య చక్కటి వాతావరణం పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదపతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ప్రభాకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్. అంబేడ్కర్, జిల్లాలోని 11 మం డలాలకు చెందిన ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రపంచ బార్బర్స్ దినోత్సవం

కంచరపాలెం, సెప్టెంబరు 16 : ప్రపంచ బార్బర్ దినోత్సవం సందర్భంగా సోమవారం కంచరపాలెం ఏరియా బార్బర్ సంఘం ఆర్కే సోషల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్బర్ల సంఘం ప్రతినిధి మల్లువలస రాధాకృష్ణ, హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, పి. వెంకటేశ్వరరావు, జి.వి. రమణతోపాటు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు



జగదాంబ కూడలి, సెప్టెంబరు 16: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆల యంలో చివరి రోజైన సోమవారం పవిత్రోత్సవ పూజలను భక్తిశ్రద్ధలతోనిర్వహించారు. ఉదయం 8 గంటల సమయంలో గణపతి పూజ, పుణ్యాహవాచన, పవిత్ర విరమణ, మహాపూర్ణాహుతి వేత ఆశీర్వచనతో పవిత్రోత్సవాలను వేద పండితులు పూర్తి చేశారు. ముం దుగా అమ్మవారి నిత్య పూజలను సంప్ర దాయ ప్రకారం అర్చ కులు జరిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనాలకు అవకాశం కల్పించారు. ఈ పూజల్లో ఈవో శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల మాత్రల పంపిణీ

కంచరపాలెం, సెప్టెంబరు 16: ప్రపంచ డీ వార్మింగ్ డే సందర్భంగా మంగళవారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేయనున్నట్టు గోపాలపట్టణం మండల విద్యాశాఖాధికారులు ఎ. సోమేశ్వరరావు, డి.దివాకర్ పేర్కొన్నారు.సోమవారం మధ్యాహ్నం భోజన అనంతరం ఉపాధ్యాయులు పిల్లందరితో మాత్రలు వేయించాలని సూచించారు. ఇప్పటికే మాత్రలు పాఠశాలలకు సరఫరా చేసినట్టు వివరించారు.



ఆర్అండ్‌బీ కార్యాలయం ముందే పార్కింగ్ చేసిన ట్రాలర్



జీఎస్ఐ కార్యాలయం ఎదుట ఇలా...

రహదారులే పార్కింగ్ ప్రదేశాలు

- మాధవధార పరిసరాల్లో సమస్య
- ఆర్టీఏ కార్యాలయం ఎదుట భారీ వాహనాలు నిలిపివేత
- వాహనదారుల రాకపోకలకు అవస్థలు

మురళీనగర్, సెప్టెంబర్ 16; ఉత్తర నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లోని మెయిన్ రోడ్లపై పార్కింగ్ స్థలాలు తరచూ మార్చుతుండడంతో వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు దీనికితోడు వాహనాలను రోడ్లపై నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. కీలకమైన ప్రభుత్వ కార్యాలయాలున్న మాధవధార ఆర్టీఏ కార్యాలయ పరిసరాల్లో ఈ సమస్య అధికంగా ఉంటోం ది. 51వ వార్డులోని మాధవధార ఉడాకాలనీ ప్రవేశమార్గంలోని హైవే సర్వీసు రోడ్డు వెంబడి ట్రాలర్లు, భారీ సరకు లారీలు నిలిపి గంటల తరబడి ఉంచేస్తున్నా రు. ఆర్అండ్‌బీ జంక్షన్‌లోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయం ఎదుట ఇదే పరిస్థితి. దీం తో ఉడాకాలనీ ప్రాంతాల నుంచిజాతీయ రహదారికి చేరేందుకు వాహనదారులకు చిక్కులు తప్పడం లేదు.

కీలకమైన ఈ మార్గంలోనే ఆర్టీఏ ఆఫీసు, ఎయిర్ పోర్టు జోన్ పోలీసు స్టేషన్, నార్త్ ఏసీపీ లా అండ్ ఆర్డర్ కార్యాలయం, జీఎస్ఐ సహా సచివాలయాలు, వాటర్ పంప్ హౌస్‌లు, ప్రైవేట్ డిగ్రీ కాలేజీలున్నాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే మార్గంలో రాకపోకలకు అడ్డంగా నిలిపివేస్తున్న వాహనాలతో ఎప్పటికపుడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఇదే సర్వీసు రోడ్డులో ఊర్వశిజంక్షన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ, బిర్లా జంక్షన్ డీ మార్ట్ వద్ద ఇదే విధమైన ఇదే సమస్యలు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.

నక్కవానిపాలెంలో నో పార్కింగ్ బోర్డులు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జరిమానా బోర్డు, కుండీలు తొలగించిన ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార, సెప్టెంబరు 16: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెంలో ఏఎంజీ ఆసుపత్రి పక్కరోడ్డులో ఏర్పాటు జరిమానా నోటీస్ బోర్డులను సోమవారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. 'ఆంధ్రజ్యోతి'లో 'ఎవరి కోసం ఈ ఆంక్షలు' శీర్షికన కథనం రావడంతో పోలీసు అధికారులు స్పందించారు. ఈ మార్గంలో ఏర్పాటు చేసిన జరిమానా బోర్డులు, కుండీలను తొలగించారు. 30 మీటర్ల దూరం కూడా లేని ఈ రోడ్డులో నాలుగు జరిమానా బోర్డులు పెట్టడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఆయా ప్రదేశాల్లో తమ వాహనాలను పార్కింగ్ చేస్తే- గతంలో ట్రాఫిక్ పోలీసులు ఫోటోలు తీసి జరిమానా విధించేవారని, ఇప్పుడు వాటిని తొలగించి సమస్య పరిష్కారం కావడంతో పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మర్రిపాలెం, సెప్టెంబరు 16: గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెం జాకీర్ హుస్సేన్‌నగర్‌లోని మజీద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో ఈద్ మిలాద్ ఉన్ నబీ (ప్రవక్త మహమ్మద్ జన్మదినం) వేడుకలు సో మవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు తెల్లవారుజామున ఫజర్ నమాజ్‌ను ఆచరించిన ఖురాన్ పఠించారు. చిన్నారులు నాతే కలంలు ఆలపించారు. అనంతరం జాకీర్ హుస్సేన్‌నగర్ నుంచి శాంతి ర్యాలీ నిర్వహించారు. కోటవీధి ఇషాక్ మదీనావలీ దర్గా వద్దకు చేరుకుని చదర్ (పవిత్ర వస్త్రం) సమర్పించి దావత్ నిర్వ హించారు. మజీద్ కమిటీ అధ్యక్షులు మూన్నా తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా వినాయకుని పల్లకి ఉత్సవం

సీతంపేట, సెప్టెంబరు 16: సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయంలో ఆలయ ఈఓ రమాబాయి, ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి పల్లకీ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని సిద్ధి, బుద్ధి సమేతంగా వినాయక ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై సీతంపేట పుర వీధుల్లో మేళతాళలతో పలు సంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, ఆయన కుమార్తె, బీజేపీ నేత శ్యామల దీపిక, కార్పొరేటర్ గోవింద్‌ల విచ్చేసి పల్లకిని మోశారు. అర్చకులు నటరాజన్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు.

అన్నసమారాధన



అల్లూరివీధిలో దీపారాధన

జ్ఞానాపురం: జ్ఞానాపురంలో బాబుకాలనీలో ఫ్రెండ్లీ బాయ్స్ ఆధ్వర్యంలో జరగుతున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ హజరై ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ అన్నదాన కార్య క్రమానికి రూ. 80వేలు విరాళం అందించారు. 32 వార్డు అమ్మవారి వీధి, 34వ వార్డు, క్లాప్ డ్రైవర్లు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో జనసేన నాయకులు, 32వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పాల్గొన్నారు.

దొండపర్తిలో దీపారాధన

దొండపర్తి: గ్రేటర్ 27వ వార్డు దొండపర్తి అల్లూరి వీధిలో రియల్ ఫ్రెండ్స్ వరసిద్ధి వినాయక మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సహస్ర దీపారాధన ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు చవితి పందిరి ఎదుట దీపాలను వెలిగించారు. అలాగే, మహిళలు ఎవరిళ్ల వద్ద వారు రంగుల ముగ్గులు వేసి దీపాలంకరణ చేయడంతో ఎంతో శోభాయానంగా కనిపించింది. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్‌గొలగాని వీరారావు బుజ్జి, కళా ఆస్పత్రి అధినేత పీవీ రమణమూర్తి, అల్లూరి అభినయ్‌రెడ్డి, పులి లోకేష్ రెడ్డి, అల్లూరి హర్షవీర్ రెడ్డి, సాయి దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ గోవింద్, తదితరులు



సాంస్కృతిక ప్రదర్శనలు

26న రాజస్థాన్‌లో బ్రహ్మకుమారీస్ సదస్సు



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ

సీతమ్మధార, సెప్టెంబరు 16: బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ నుంచి రాజస్థాన్ మౌంట్‌అబులో నిర్వహించనున్న జాతీయ మీడియా సదస్సునువిజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ మేయర్, టీడీపీ సీనియర్ నాయకుడు దాడి సత్యనారాయణ అన్నారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని సింధూర అతిథి గృహంలో బ్రహ్మ కుమారీస్ విశాఖ మీడియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మౌంట్‌అబులో జరిగే జాతీయ సదస్సులో పలు ఆధ్యాత్మిక అంశాలపై విశ్లేషణ ఉంటుందని, జర్నలిస్టుల ఈ యాత్ర విజయవంతం చేయాలన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ రాజస్థాన్‌లో గల మౌంట్ అబులో ప్రజాపీత బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయంలో జాతీయ మీడియా సదస్సు ఈ నెల 26 నుంచి 30 వరకు సాగుతుందన్నారు. ఆధ్మాత్మికత, క్రమశిక్షణకు ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జాతీయ వినియోగదారుల మండలి చైర్మన్ సాయి రమేష్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు శివజ్యోతి, సిద్దు, మరళీకృష్ణ, సునీత, నారాయణ, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



మార్చురీలో మృతదేహం

సీతంపేట, సెప్టెంబరు 15: గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈనెల ఒకటో తేదీన పోర్టు ఆసుపత్రి సమీపంలో ఈ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉ న్నారు. నాలుగో పట్టణ పోలీసు సిబ్బంది గుర్తించి 108 వాహనంలో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మృతి చెందారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఎవరైనా సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

28న భగత్‌సింగ్‌పై వ్యాస, వక్తృత్వ పోటీలు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 16: స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ 117 జయంతి సందర్భంగా దిశ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నవజవాన్ భారత్ సభ (ఎన్‌బీఎస్) నగరంలోని వివిధ స్కూల్స్‌కు, కాలేజీలు, హాస్టళ్లలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. భగత్‌సింగ్ ఆలోచనలు, నేటి సమాజంలో వాటి ఆవశ్యకతను ప్రధానంగా తెలియజేయాలన్నదే పోటీల ఉద్దేశం. ఇతర వివరాలకు ఫోన్ 90522 44546, 70857 55584ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

- యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్చరిక



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 15: విశాఖ పోర్టు ట్రస్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేట్ పరం చేయాలన్న యోచన తగదని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. జగదాంబ వద్ద సీఐటీయూ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. విశాఖ పోర్టు ట్రస్ట్ యాజమాన్యంలో నడుస్తున్న గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. 90 ఏళ్ల చరిత్రగల ఈ ఆస్పత్రి పరిరక్షణకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆస్పత్రిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోర్టు ట్రస్ట్ చైర్మన్, ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు సెక్రటరీకి వేల మంది పోర్టు ఉద్యోగులతో సంతకాల సేకరణ చేసి పంపుతామన్నారు. ఈ హాస్పిటల్ ప్రైవేట్ పరం చేసే చర్యలకు వ్యతిరేకంగా ఈనెల 19నుంచి విధుల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన కొనసాగిస్తామన్నారు. పోర్టు ఏవోబీ వద్ద 24న పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. పోర్టు హాస్పిటల్ ఎదుట అక్టోబరు 1 తేదీన నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ దీక్షల్లో కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు వి.రామలింగేశ్వరరావు, జక్కన్న సత్యనారాయణ, బి.లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఫిల్మ్ ఇండస్ట్రీని తీసుకువచ్చేందుకు కృషి

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



రామ్మోహన్‌నాయుడిని సత్కరిస్తున్న అచ్యుతరావు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 16: సినిమా పరిశ్రమను తెలంగాణ నుంచి ఏపీకి రప్పించేందుకు కృషి చేయనున్నట్టు కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. సోమవారం నగరంలోని కేంద్ర మంత్రిని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ డా.కంచర్ల అచ్యుతరావు కలిసి వినతి పత్రం అందజేశారు. ఫిల్మ్ ఇండస్ట్రీ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ఇండస్ట్రీ విశాఖకు తరలివస్తే వందల కుటుంబాలకుఉపాధి కలుగుతుందని తెలిపారు.

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

ఆరిలోవ, సెప్టెంబరు 16 : ఎండాడ పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం ఉదయం పొట్నూరి అప్పలరాజు (35) అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. అతను మృతికి అదే ప్రాంతానికి చెందిన మనోజ్, షణ్ముఖరావు కారణమని ఆరిలోవ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకా రం...ఎండాడ వివేకానందనగర్ పార్కు సమీపంలో సాయితేజ అపార్ట్‌మెంట్‌లో అప్పలరాజు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం బైక్ మీద ఎండాడ పెట్రోల్ బంక్‌కు వచ్చాడు. పెట్రోల్ కొట్టించుకుని బంక్ నుంచి వస్తుండగా అక్కడికి సమీపంలో ఉన్న స్క్రాప్ దుకాణం వద్ద మనోజ్, షణ్ముఖరావు బైక్ ఆపారు. అప్పటికే మద్యం మైకంలో ఉన్న వారు అప్పలరాజును అగ్గిపెట్టె అడిగారు. అతను లేదని చెప్పి బైక్ తీయగా వారిద్దరూ అప్పలరాజును గట్టిగా వెనక్కి లాగారు. దీంతో అతను స్క్రాప్ దుకాణం వద్ద ఉన్న మెట్లపై పడిపోవడంతో తలకు బలమైన గా యమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

విశాఖ-దుర్గ్ వందే భారత్ ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

రైల్వే స్టేషన్ అభివృద్ధి జరుగుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ, వందే భారత్ రైళ్లలో టికెట్ చార్జీలు అధికంగా ఉన్నాయని, వాటిని తగ్గించి, సామాన్యులు కూడా ప్రయాణించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ హరికుమారి, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రసంగించగా, ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, పాల్గొన్నారు.

ఏపీటీడీసీ లీజులపై విజిలెన్స్

... 5వ పేజీ తరువాయి

పనిచేసిన వైసీపీ నాయకురాలి వద్ద ఓఎస్డీగా పనిచేశారని సమాచారం. ఆ వివరాలు తెలుసుకున్న 'బే వాచ్' లీజుదారులైన స్థానిక వైసీపీ నాయకులు ఆ నాయకురాలికి ఫోన్ చేసి సాయం చేయాల్సిందిగా కోరడంతో, ఆమె విజిలెన్స్ అధికారికి ఫోన్ చేసి వ్యతిరేక నివేదిక ఇవ్వవద్దని చెప్పినట్టు తెలిసింది. అక్కడితో ఆగకుండా తొట్లకొండ ఏ పరిధిలో ఉందో ఆ నియోజకవర్గ కూటమి నాయకుడితో కూడా విజిలెన్స్ బృందానికి ఫోన్ చేయించి, ఫిర్యాదులను లైట్‌గా తీసుకోవాలని చెప్పించినట్టు తెలిసింది. విచారణ ముగించుకొని విజయవాడ వెళ్లిపోయిన ఆ బృందం ఏమని నివేదిస్తుందో, ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి. అయినా వైసీపీ నాయకులకు చెందిన లీజు ఒప్పందాలను రక్షించడానికి కూటమి నాయకులు యత్నించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఉక్కుపై కేంద్రం ద్వంద్వ వైఖరి

... 5వ పేజీ తరువాయి

దిగజారిపోవడం గమనించిన సీనియర్ మేనేజర్ స్థాయి అధికారులు 200 మంది ఇప్పటికే రాజీనామా చేసి వెళ్లిపోయారు. ప్రతి నెలా సగటున 20 మంది పదవీ విరమణ చేస్తున్నారు. మరోవైపు నియామకాల ప్రక్రియ చాలాకాలం క్రితమే ఆపేశారు. దీంతో ఇప్పటికే కీలక విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. ప్లాంటును పూర్తి స్థాయిలో నడపాలంటే ప్రస్తుతం 300 మంది ఇంజనీర్లు అవసరమని, కనీసం కాంట్రాక్టు ప్రాతిపదికనైనా నియమించుకోవడానికి అనుమతి ఇవ్వాలని గత ఏడాది నాటి సీఎండీ అతుల్ భట్ ఉక్కు మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. ఇక్కడ పరిస్థితి ఇలా ఉండగా, ఉన్నవారిని దశల వారీగా ఇతరచోట్లకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఇంకో వైపు స్వచ్ఛంద పదవీ విరమణకు కూడా నిధులు ఇస్తామని చెబుతున్నారు.

ఇదంతా కుట్ర

-అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ

కేంద్రం చేపడుతున్న చర్యలు చూస్తుంటే...విశాఖపట్నం ప్లాంటులో ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని కృతనిశ్చయంతో ఉన్నట్టు కనిపిస్తోంది. ఏదో కంటితుడుపుగా కొంత ఆర్థిక సాయం చేసి, నష్టాల నుంచి బయటకు రాలేకపోయారు కాబట్టి...ఇక ఏమీ చేయలేమని చెప్పి చేతులు దులుపుకోవాలని కుట్ర చేస్తున్నారు. అలాకాకుండా ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడానికి అవసరమైన ముడి పదార్థాలు సమకూరిస్తే 100 శాతం ఉత్పత్తితో ఈ గండం నుంచి గట్టెక్కిస్తాం.

ఇళ్ల నిర్మాణం పునఃప్రారంభం

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేయగా, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయి.

ఆదినుంచీ రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా మొండి వైఖరి

అనంతపురం జిల్లాలోని వైసీపీ మాజీ ప్రజా ప్రతినిధికి చెందిన రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా సంస్థకు తొలుత 35 వేల ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఆది నుంచీ ఈ సంస్థ ఇష్టానుసారంగా వ్యవహరించడం, అధికారుల ఆదేశాలను పాటించకపోవడం, పనులు చేపట్టకపోవడంతో సంఖ్యను విడతల వారీగా తగ్గించి చివరకు 11,575 ఇళ్లకు పరిమితం చేశారు. కాగా ఈ ఏడాది మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత నిర్మాణ బాధ్యతలు చేపట్టిన అన్ని కంపెనీలు ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశాయి.

పూర్తిచేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు

రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇటీవల ఇళ్ల పురోగతిపై సమీక్షించింది. నిర్మాణ బాధ్యతలు తీసుకున్న రాక్‌ట్రీ ఇన్‌ఫ్రాపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అదే సమయంలో మిగిలిన కంపెనీలు, సంస్థలు పనులు తిరిగి ప్రారంభించుకునేలా ఆదేశాలు జారీచేసింది. రాక్‌ట్రీ మినహా మిగిలిన చిన్న కంపెనీలు ఇప్పటికే పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లుచేసుకున్నాయి. పెద్ద కంపెనీలు కూడా త్వరలో పనులు చేపట్టేందుకు ముందుకువచ్చాయి. అయితే రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా ఇప్పటివరకు నిర్మాణాలు చేపట్టి, మధ్యలో విడిచిపెట్టిన వాటిని ఎలా పూర్తిచేయాలనే దానిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఇదిలావుండగా పనులు చేపట్టేందుకు అవసరమైన ఇనుము, సిమెంట్ త్వరలో సరఫరా కానున్నాయని జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి ఒకరు తెలిపారు. కొన్ని లేఅవుట్‌లలో చిన్నచిన్న పనులు చేపట్టేందుకు ఇసుక అందుబాటులో ఉందన్నారు. పనులు పూర్తిస్థాయిలో మొదలయ్యేసరికి గోదావరి, వంశధార నుంచి ఇసుక తీసుకువస్తామన్నారు. మార్చి వరకు చేపట్టిన పనులకు ఇంతవరకు సంబంధిత కంపెనీలకు రూ.479 కోట్లు చెల్లించామని, పెండింగ్‌లో ఉన్న మరో రూ.25 కోట్లు త్వరలో విడుదలవుతాయన్నారు.

బియ్యం సరఫరాలో చేతివాటం

... 5వ పేజీ తరువాయి

ఇండెంట్ పెట్టిన డీలరుకు సగటున 60 నుంచి 75 కిలోలు, 10 టన్నులు అయితే 150 కిలోలు, అంతకు మించి ఎక్కువ ఇండెంట్ ఉన్న డీలర్లకు 300 నుంచి 400 కిలోల వరకూ తరుగు ఉంటుంది. అలాగే నిబంధనల ప్రకారం ప్రతి బస్తాకు సంబంధించి గోనె సంచి బరువు మినహాయించాలి. ఖాళీ గోనె బరువు 580 గ్రాములు. అంటే 50 కిలోల బస్తా ఇవ్వాలంటే 50.580 కిలోల బరువు ఉండే బియ్యం అందజేయాలి. అయితే ఖాళీ గోనె బరువు కలిపి తూకం వేసి ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత నెలకు సంబంధించి వన్‌టౌన్‌లో ఒక డీలరుకు సరఫరా చేసిన బియ్యంలో 175 కిలోలు తగ్గాయి. మర్రిపాలెం, అక్కయ్యపాలెం, సీతమ్మధార, మద్దిలపాలెం ప్రాంతాల్లో డీలర్లకు సగటున 100 కిలోల నుంచి 200 కిలోల వరకు తూకంలో తేడా వచ్చిందని డీలర్లు చెబుతున్నారు. మధురవాడ, ఆరిలోవ ప్రాంతాల్లో ఒక్కో డీలర్ పరిధిలో 1,200 కార్డులు దాటి ఉన్నందున అక్కడ మరింత ఎక్కువగా తూకంలో తేడాలు వస్తున్నాయని చెబుతున్నారు. మర్రిపాలెంలో-1 గోదాములో తూకంలో తేడాలు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ ఉద్యోగిని మాతృశాఖకు సరండర్ చేసి అక్కడ పౌర సరఫరాల సంస్థ నుంచి ఒకరికి బాధ్యతలు అప్పగించారు. అయితే ఎటువంటి మార్పులేదని డీలర్లు ఆరోపిస్తున్నారు. పొరపాటున ఎవరైనా నేరుగా కలెక్టర్/జాయింట్ కలెక్టర్‌లకు ఫిర్యాదు చేస్తే సదరు డీలర్‌కు వేధింపులు ఎదురవుతుంటాయి. దీంతో ఎవరూ ఫిర్యాదు చేయడానికి సాహసించలేకపోతున్నారు. దానిని ఆసరాగా తీసుకుని గోదాముల ఇన్‌చార్జులు, సిబ్బంది చెలరేగిపోతున్నారు. చివరకు సంఘాలు నేతలు కూడా తమ ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం లేదని డీలర్లు వాపోతున్నారు.

విమ్స్‌లో ప్రారంభానికి సిద్ధంగా డయాగ్నస్టిక్ సెంటర్

ఆరిలోవ, సెప్టెంబరు 16 : విమ్స్ ఆవరణలో సుమారు 21 కోట్ల రూపాయలతో నిర్మించిన సిటీ డయాగ్నస్టిక్ సెంటర్, రీజనల్ డ్రగ్స్ సెంటర్ భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటి నిర్మాణాలను ఏపీ ఎంఎస్‌డీసీ నిధులతో చేపట్టారు. వచ్చే నెలలో ఈ భవనాలను ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సిటీ డయాగ్నస్టిక్ కేంద్రంలో రోగులకు ఇకపై అన్ని రకాల పరీక్షలు లభిస్తాయి. అలాగే ప్రాంతీయ డ్రగ్స్ సెంటర్ నుంచి నాలుగు జిల్లాలకు మందులు సరఫరా చేయనున్నారు.

సీపీఐ నేత సన్యాసిరావుకు నివాళి

మధురవాడ, సెప్టెంబరు 16 : మధురవాడ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ నాయకుడు పోతిన సన్యాసిరావు అని వక్తలు పేర్కొన్నారు. క్వారీ సొసైటీ, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మధురవాడలోని సీపీఐ కార్యాలయం వద్ద సన్యాసిరావు 40వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ పాలనతోనే దేశం అభివృద్ధి'

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 16 : బీజేపీ పాలనతోనే దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు అన్నారు. సోమవారం ఆయన ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పార్టీ సభ్యత్వ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పదేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ అన్ని రంగాల్లోనూ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ఒకవైపు పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తూనే... మరోవైపు దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం సాధించిన ప్రగతిని నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి, సభ్యత్వాల నమోదు పెంచాలని ఆయన పిలుపునిచ్చారు.

పంటల నమోదుకు గడువు పెంపు

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 16 : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంటల నమోదుకు ప్రభుత్వం ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు ఏవో ఎంపీ చలం తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంకా పంటల నమోదు చేయించుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'రోడ్లు బాగు చేయండి'

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 16 : భీమిలి నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఛిద్రమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల నాయకుడు రవ్వ నరసింగరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం ప్రాంతాల్లో ప్రధాన రహదారులు గోతులతో ఉండడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రెడ్డిపల్లి ప్రధాన రహదారి పనులు ఐదేళ్లుగా నిలిచిపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు. అలాగే రేవిడి - అయినాడ, పద్మనాభం-శొంఠ్యాం, అనంతవరం - అలమండ ఆర్‌ఎస్ రోడ్డు, మద్ది - అలమండ రోడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయని, అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు.

రిఫరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి

ఆరిలోవ, సెప్టెంబరు 16 : ఆరిలోవ రిఫరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. వర్షాకాలం కావడంతో చాలామంది జ్వరాలతో ఆస్పత్రికి వస్తున్నారు. రోజూ 250 ఓపి నమోదవుతుందని వైద్యాధికారిణి డాక్టర్ అనిత చెప్పారు. వారిలో సుమారు 50 మంది వరకు వైరల్ జ్వరాలతో ఉంటున్నారని తెలిపారు.ఆస్పత్రిలో ఎటువంటి మందుల కొరత లేదన్నారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ

భీమునిపట్నం, సెప్టెంబరు 16 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పద్మనాభం మండలం చిన్నాపురం ప్రాథమిక పాఠశాల రిటైర్డ్ హెచ్‌ఎం నెట్టి నారాయణరావు కుర్చీలను వితరణగా అందించారు. సోమవారం ఆ పాఠశాలలో శత వసంతాల వేడుకల కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గాడు అప్పలనాయుడు, మైలపల్లి లక్ష్మణరావు, పాఠశాల హెచ్‌ఎం పొన్నగంటి రమణకు దాత కుర్చీలను అందించారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 52, టమాటా 38, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 40, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయలు 34, కాలీఫ్లవర్ 44, క్యాబేజి, 22, క్యారెట్ 40, దొండకాయలు 34, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 110, బరబటి 42, ముల్లంగి 34, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయ 30, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..



బీచ్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టు



రోడ్డుపై విచ్చలవిడిగా వాహనాల పార్కింగ్

బీచ్‌రోడ్డులో ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

- ఫుడ్‌కోర్టుల ఆక్రమణల ఫలితం
- విచ్చలవిడిగా వాహనాల నిలిపివేత
- నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు
- స్పందించని పోలీసులు, జీవీఎంసీ

రామ్‌నగర్, సెప్టెంబరు 16 : సాగర తీరంలో వాహనదారులు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. పార్కింగ్ స్థలాలన్నీ ఫుడ్ కోర్టుల ఆక్రమణలో ఉండడంతో ఈపరిస్థితి నెలకొంది. బీచ్ రోడ్డుకు ప్రతిరోజూ సాయంత్రం వేళ నగరవాసులు, పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు.శని, ఆదివారం, పండగ రోజుల్లో ఆ సంఖ్య మరింత అధికంగా ఉంటోంది. ప్రతి ఒక్కరూ కుటుంబాలు, స్నేహితులతో కలసి ఏదో ఒక వాహనంపై వస్తుంటారు. ఈమేరకు జీవీఎంసీ వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసింది. ఆ ప్రదేశాలు ఉన్నాయని కనీసం గుర్తులేని విధంగా ఫుడ్ కోర్టులు వాటిని ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నాయి. పార్కింగ్ ప్రదేశాల్లో ఫుడ్ కోర్టుల నిర్వాహకులు తమ విక్రయాలకు వీలుగా కుర్చీలు వేసి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు కనీస స్థలం విడిచి పెట్టడం లేదు. ఈ స్థితిలో వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ట్రాఫిక్ పోలీసులు రాంగ్ పార్కింగ్‌ల పేరుతో ఫొటోలు తీసి చలానాలు వేస్తున్నారు. పార్కింగ్ ప్రాంతాలను ఆక్రమించిన ఫుడ్‌కోర్టు వ్యాపారులను మాత్రం అటు పోలీసులు గాని, ఇటు జీవీఎంసీ అధికారులు గాని ప్రశ్నించకపోవడం గమనార్హం. ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్ వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కనీసం నడవడానికి కూడా ఇబ్బంది నెలకొంటోంది. ఈ సమస్యపై అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్‌గజపతిరాజు

'భవిష్య మార్గదర్శిని' పుస్తకావిష్కరణ

సింహాచలం, సెప్టెంబరు 16 : వరాహలక్ష్మీనృసింహస్వామికి సంబంధించి అనేక ఉత్సవాల సమాహారంతో కూడిన భవిష్య మార్గదర్శిని పుస్తకాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు ఆవిష్కరించారు. అప్పన్న ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో పాల్గొనేందుకు సింహగిరికి వచ్చిన ఆయన ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, ఆలయ వైదిక అధికారులతో కలిసి సోమవారం ఆలయ కల్యాణ మండపంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ స్వామివారికి ఏడాది పొడవునా జరిగే నిత్య, వార, పక్ష, మాస, వార్షిక ఉత్సవాల సమగ్ర సమాచారాన్ని పుస్తకంలో పొందుపరచినట్టు తెలిపారు. ఈఓ మాట్లాడుతూ త్వరలోనే ఈ పుస్తకాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, సెప్టెంబరు 16 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన గంటి కామేశ్వరరావు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్కు రూపంలో సోమవారం అన్న ప్రసాద విభాగం ఇన్‌చార్జి ఏఈఓ పిల్లా శ్రీనివాసరావుకు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించారు.

'మిషన్ గ్రీన్ భీమిలి' సభ్యులకు సన్మానం



మిషన్ గ్రీన్ సభ్యులను సన్మానిస్తున్న ఫాట్ సభ్యులు

భీమునిపట్నం, సెప్టెంబరు 16 : మిషన్ గ్రీన్ భీమిలి వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న గుల్లల వెంకటేష్, ముమ్మిడిశెట్టి ఆదిత్యను ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫాట్ సభ్యులు మాట్లాడుతూ మూడేళ్లుగా పట్టణంలోని కొండలపై విత్తనాలు, విత్తన బంతులను వెదజల్లడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న మిషన్ గ్రీన్ భీమిలి సభ్యులు అభినందనీయులని చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సత్యానారాయణ, సన్నీ, సూర్య శ్రీనివాస్, అశోక్, దేవానంద్, రమణారావు, నరేంద్రకుమార్, బంగార్రాజు, సూర్యనారాయణమూర్తి, ఎన్. శ్రీను పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఎంవీపీ పీఎస్‌ను తనిఖీ చేసిన కమిషనర్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 16 : నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఎంవీపీ పోలీస్ స్టేషన్‌ను సోమవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడారు. అలాగే ఫిర్యాదుదారులతోనూ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఆయనతో పాటు సీఐ మురళీ ఉన్నారు.

నేడు అనంత పద్మనాభుడి చతుర్దశి వేడుకలు

పద్మనాభం, సెప్టెంబరు 16 : పద్మనాభంలోని అనంత పద్మనాభుని చతుర్దశి వేడుకలు మంగళవారం జరగనున్నాయి. ఈమేరకు కుంతీమాధవ స్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి తోరణాలు, అరటి చెట్ల అలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఏటా భాద్రపద శుద్ధ చతుర్దశి రోజున నిర్వహించే ఈ ఉత్సవంలో భాగంగా భక్తులతో సామూహిక అనంత పద్మనాభుని వ్రతాలు నిర్వహించడం ఆనవాయితీ. వ్రతాల నిర్వహణకు ఇప్పటికే స్వామివారి కల్యాణం జరిగే వేదిక వద్ద టెంట్లు, కార్పెట్లు సిద్ధం చేశారు. సుమారు 150 మంది దంపతులు ఈ వ్రతాలను చేయించుకోవడానికి పేర్లు నమోదు చేసుకున్నారు.

క్రీడా పోటీల్లో భీమిలి కేజీబీవీ బాలికల ప్రతిభ

భీమునిపట్నం, సెప్టెంబరు 16 : కర్నూలు జిల్లా డీఎస్‌ఏ ఔట్ డోర్ స్టేడియంలో అండర్ 17 బాల బాలికలకు ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆటియా-పాటియా క్రీడా పోటీల్లో భీమిలి కేజీబీవీ బాలికలు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఈమేరకు విద్యాలయం ప్రిన్సిపాల్ గంగాకుమారి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాలయం నుంచి 9, 10, ఇంటర్ విద్యార్థినులు పాల్గొన్నారని, విజేతలకు డీఈవో చంద్రకళ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అభినందించారని చెప్పారు.

'డైట్'లో ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం

భీమునిపట్నం, సెప్టెంబరు 16 : పట్టణంలోని డైట్ కళాశాలలో సోమవారం ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికుమారి మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణకు 1987లో ప్రపంచ దేశాల మధ్య మాంట్రియల్ ప్రోటోకాల్ ఒప్పందం జరిగిందన్నారు. ఓజోన్ పొరను నాశనం చేసే ఉద్గారాలను ఉత్పత్తి చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం భూగోళాన్ని ఓజోన్ పొర రక్షించే విధానాన్ని ఛాత్రోపాధ్యాయులు గొడుగుల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యు. మాణిక్యంనాయుడు, అధ్యాపకులు ఎల్. సుధాకర్, ఆర్. నీలిమ, నాగేశ్వరరావు, గొట్టేటి రవి, ఎం. మహాలక్ష్మి, సిపి సోమయాజులు, ఎస్.త్రినాథరావు, పి. హరిణి పాల్గొన్నారు.

వార్డుల్లో అన్నదానాలు.. గణేశ్ ప్రతిమల నిమజ్జనాలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 16 : జీవీఎంసీ 15వ వార్డు ఉమానగర్‌లో వినాయక ఉత్సవాల్లో భాగంగా మహా అన్నదానం చేపట్టారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాప్ రుద్ర కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే పాత వెంకోజీపాలెంలోని రామాలయం పక్కన లేజీ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గణనాథుడి వద్ద నుంచిన లడ్డూ వేలం వేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, మేళతాళాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రతిమను నిమజ్జనం చేశారు.

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు ఆదిత్యనగర్‌లో టీడీపీ నాయకుడు నాగోతి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, తదితరులు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ రెవెన్యూ కాలనీ కూడలిలో ఉత్తమ్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం కుంకుమ పూజ నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కూడలిలో నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు నాలుగు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు రాజా, భీమా, నితిన్, హరి, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది : పీఎంపాలెంలోని ఆర్‌హెచ్ కాలనీ, బి2 కాలనీల్లో అన్నదానాలు నిర్వహించారు. వీటిని టీడీపీ విశాఖ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ ప్రారంభించారు.అలాగే బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కమాండెంట్ మురళీకృష్ణ దంపతులు, అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్ సత్యం పాల్గొన్నారు. 5వ వార్డులోని పలు కాలనీల్లో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో కార్పొరేటర్ మొల్లి హేమలత, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం (రూరల్) : జీరుపేటలో వినాయక విగ్రహాల అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా లడ్డూ వేలం నిర్వహించగా జి. లోకేష్‌రెడ్డి రూ 3 వేలకు పాడారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య వినాయక నిమజ్జనం జరిపారు.

పద్మనాభం : పద్మనాభంలో గణేశ్ ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు సోమవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు అనుపోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న అర్చకులు

సంప్రదాయబద్ధంగా పవిత్రోత్సవాల పూర్ణాహుతి

సింహాచలం, సెప్టెంబరు 16 : వరాహలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో జరుగుతున్న వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పూర్ణాహుతి నిర్వహించారు. వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై ఉంచారు. ఉదయం, సాయంత్రం వైదికులు పారాయణలు చేసి చతుర్వేదాలు, రామాయణ, భారతాది ఇతిహాసాలు,విష్ణు పురాణం, క్షేత్రమహాత్మ్యం, క్రిష్ణమయ్య సంకీర్తనలను విన్నపాలు చేశారు. భక్తులకు రాత్రి స్వామివారి దర్శనాలు నిలిపివేసిన తరువాత ప్రత్యేక హవనం జరిపారు. శాస్త్ర విధానంలో పూర్ణాహుతి ద్రవ్యాలను భక్తులతో స్పృశింపజేసిన తరువాత వాటిని హోమ కుండంలో వేయడంతో నాలుగు రోజుల పాటు ఉభయ సంధ్యలలో జరిపిన ప్రత్యేక హోమాలకు ముగింపు పలికారు. అలాగే నాలుగు రోజులుగా పూజలు జరిపిన ప్రధాన కలశాన్ని పురోహితులు కరి సీతారామాచార్యులు శిరస్సున దాల్చి అంతరాలయంలో స్వామివారి సన్నిధిలో ఉంచి పూజలు చేశారు. అందులోని పవిత్ర జలాలతో భక్తులను,ఆలయ సిబ్బంది, అధికారులను ప్రోక్షణ జరిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి సతీసమేతంగా పాల్గొనగా ఏఈఓ ఆనందకుమార్, ఇన్‌చార్జి ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావు, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు,ఐవి రమణాచార్యులు, స్థానాచార్యులు రాజగోపాల్ పాల్గొన్నారు.

వాహనాల ఫిట్‌నెస్ టెస్టులు ప్రైవేటుకు అప్పగించొద్దు

- ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్



మాట్లాడుతున్న పడాల గోవింద్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 16 : ఆటో డ్రైవర్ల డ్రైవింగ్ టెస్టు, వాహనాల ఫిట్‌నెస్ టెస్టులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ డిమాండ్ చేశారు. కృష్ణా కళాశాల సమీపంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఆటో యూనియన్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మోటారు సవరణ చట్టం న్యాయ సంహిత బిల్లులో భాగంగా వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్ టెస్టింగ్ చేసే ట్రాక్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించి, ఆటోమేటిక్ సెన్సార్ టెస్టింగ్ ట్రాక్ ద్వారా జారీచేసే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు సెన్సార్ విధానాలతో ప్రభుత్వానికి, ప్రైవేటు వ్యక్తుల జేబులు నిండడం మినహా వాహనదారులకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ప్రైవేటు సంస్థలకు అప్పగించే ఈ ప్రతిపాదన రద్దు చేయాలని కోరారు.ఈ సమావేశంలో వాసు, లోవరాజు, శివశ్రీను, నాగు, నంద, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఎంవీవీ సిటీలో సమస్యలు పరిష్కరిస్తా

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ, సెప్టెంబరు 16 : ఎంవీవీ సిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఆదివారం రాత్రి ఆయన ఎంవీవీ సిటీలో ఏర్పాటు చేసిన గణేశ్ నిమజ్జనోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గేటెడ్ కమ్యూనిటీ సభ్యులు ఎంవీవీ సిటీలో ఉన్న ప్రజా సమస్యలను ఆయనకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అపార్ట్‌మెంటు నివాసితులకు జీవీఎంసీ నుంచి బల్క్ వాటర్ అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

చురుగ్గా కల్యాణ మండపాల ఆధునికీకరణ పనులు



మండపంలో లోపల జరుగుతున్న ఆధునికీకరణ పనులు

మధురవాడ, సెప్టెంబరు 16 : శిల్పారామంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఇక్కడ ఉన్న రెండు కల్యాణ మండపాల ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వీటిని గతంలో అరకొర సౌకర్యాలతో నిర్మించడంతో శుభకార్యాలు చేసుకోవడానికి అనువుగా లేక ఎవరూ ముందుకు రాకపోవడంతో నిరుపయోగంగా ఉండేవి. ఈనేపథ్యంలో ఆరు నెలలు కిందట ఆధునికీకరణకు చర్యలు చేపట్టారు. రెండు మండపాల్లో సెంట్రల్ ఏసీతో పాటు విద్యుత్ లైట్లు, ప్రైవేటు కన్వెన్షన్ హాళ్లకు దీటుగా సకల సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సుమారు రూ. 2 కోట్లను పీపీపీ పద్ధతిలో ఉపయోగిస్తున్నారు. ప్రతి నెలా శిల్పారామానికి రూ. 1.52 లక్షల అద్దె చెల్లించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో కల్యాణ మండపాలు శిల్పారామంకు ఆదాయ వనరుగా మారనున్నాయి. అన్ని పనులు పూర్తయితే కార్తీక మాసంలో వీటిని ప్రారంభించనున్నారు.

దుర్గానగర్‌లో మంచినీటి పైపులైన్ పరిశీలన



పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఈఈ ఏడుకొండలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 16 : జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్ కొండవాలు ప్రాంతంలో ఉన్న దుర్గమ్మ ఆలయం రోడ్డులో మరమ్మతుకు గురైన పైపులైన్‌ను మంచినీటి సరఫరా విభాగం ఈఈ ఏడుకొండలు సోమవారం పరిశీలించారు. పైప్‌లైన్ పాడవ్వడంతో స్థానికులు తాగునీటికి పడుతున్న ఇబ్బందులను స్థానిక నాయకులు ఎమ్మెల్యే వెలగపూడి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు ఈఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే కాలనీలోని ఒక వీధిలో ఉన్న యూజీడీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, జనసేన సీనియర్ నాయకుడు పచ్చితాల సాయిబాబా, కేఎస్‌ఆర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

డెంగ్యూ పట్ల అప్రమత్తం : డీఎంహెచ్‌ఓ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగదీశ్వరరావు

ఆనందపురం, సెప్టెంబరు 16 : గ్రామాల్లో విజృంభిస్తున్న డెంగ్యూ జ్వరాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండా లని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు ఆదేశించారు. సోమవారం ఆయన ముచ్చర్ల గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో డెంగ్యూ కేసులు నమోదు కావడంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు ఎక్కడైనా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనతంరం సర్పంచ్ షిణగం ఎర్రయ్య, స్థానిక నాయకులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించారు. ఆయనతో పాటు శొంఠ్యాం పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ కూడా ఉన్నారు.

సీతారామ సేవా సంఘం స్థలానికి ఫెన్సింగ్ పోల్స్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 16 : పాత వెంకోజీపాలెంలోని గవరవీధిలో ఉన్న సీతారామ సేవా సంఘానికి చెందిన మూడు సెంట్ల స్థలంలో సంఘం పెద్దలు సోమవారం ఫెన్సింగ్ పోల్స్ వేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఆడారి పరదేశినాయుడు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని బాగుచేసి సంఘం ఆధ్వర్యంలో అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

భీమునిపట్నం, సెప్టెంబరు 16 : మహమ్మద్ ప్రవక్త జయంతి పురస్కరించుకుని భీమిలి జామియా మసీదులో ముస్లిం సోదరులు సోమవారం మిలాద్ ఉన్ నబీ ఘనంగా జరిపారు. సంప్రదాయ దుస్తుల్లో ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం జామియా మసీదు నుంచి చిన్నబజారు జంక్షన్, కాలేజీ రోడ్డు, గంటస్తంభం, పాత బస్టాండ్ వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ.. జీవనం సాగించాలన్నారు.

'గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి'

ఆరిలోవ, సెప్టెంబరు 16 : సీతారాం ఏచూరి దేశం గర్వించదగ్గ నాయకుడు అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు పి. మణి అన్నారు. సోమవారం ఆరిలోవలోని సీపీఎం కార్యాలయంలో ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఉన్నత కుటుంబంలో జన్మించినప్పటికీ తన మొత్తం జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేశారన్నారు. 12 ఏళ్ల రాజ్యసభ ఎంపీ ఎన్నో ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తారని చెప్పారు. ఆరిలోవ సీపీఎం కార్యదర్శి నరేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు శంకర్, సత్యన్నారాయణ, రంగమ్మ, నాగరాజు, భూలోకరావు, చంటి, కాంత, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థ భ్రష్టు : ప్రణవ్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 16 : వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నాశనమైందని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ ప్రణవ్‌గోపాల్ ఆరోపించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వవిద్యాలయాల్లో జగన్ తన సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించుకుని, రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చారని చెప్పారు. నాడు నేడు పథకం కింద రూ. కోట్ల దండుకున్నారని విమర్శించారు. మంత్రి లోకేశ్ అన్ని వ్యవస్థలు, అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.